ప్రతి అక్షరం - ప్రజల కోసం
# రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 66
బుధవారం 28 ఆగస్టు 2024
చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్
HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## ఐసీసీకి జైషా

చైర్మన్‌గా
ఏకగ్రీవ ఎన్నిక
డిసెంబరు
ఒకటిన
బాధ్యతల
స్వీకరణ



7

## ఆధ్యాత్మికతకు ఆలవాలంగా 'గుట్ట' ఆలయం

గవర్నర్ విష్ణు దేవ్ వర్మ వెల్లడి
గుట్టలో ప్రత్యేక పూజలు చేసిన గవర్నర్
గవర్నర్ కు స్వాగతం పలికిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య
ఏర్పాట్లను పర్యవేక్షించిన ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం



యాదగిరిగుట్ట, ఆగస్టు 27 (రోమింగ్ న్యూస్): యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం ఆధ్యాత్మికతతో దేశంలో ప్రముఖ ఆలయంగా వెలుగొందుతున్నదని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

మిగతా 2 లో






## రాజముద్రనే మార్చేస్తారా?

ఇది అధికారికమా..
అనధికారికమా
వరంగల్ ఫ్లెక్సీపై కెటిఆర్ ఆగ్రహం

**గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తెలంగాణ రాజముద్రను మార్చడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. ఇది అధికారిక నిర్ణయమా లేక అనధికార నిర్లక్ష్యమా అని మండిపడ్డారు. అసలు ఏం జరుగుతుందో కనీసం మీకైనా తెలుసా అంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని ప్రశ్నించారు.**

హైదరాబాద్,ఆగస్ట్27 : తెలంగాణ అస్తిత్వ చిహ్నాలైన కతీయ తోరణం, చార్మినార్‌లతో ఈ వెకిలి పనులు ఏంటంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్ లేని రాజముద్రతో గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఎదుట అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఇది.. ఈ కొత్త చిహ్నం ఎవరు, ఎప్పుడు ఆమోదించారంటూ నిలదీశారు. ఒకవేళ ఆమోదించకపోతే అధికారులు ఎందుకు

మిగతా 2 లో

# 17నుంచి ప్రజాపాలన

## హెల్త్, రేషన్ కార్డుల కోసం వివరాల సేకరణ



పది రోజులపాటు దరఖాస్తుల స్వీకరణ
హెల్త్‌కార్డుల ద్వారానే ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్
అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ వెల్లడి
సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
రాష్ట్రవ్యాప్తంగా నివారణ చర్యలు చేపట్టండి
ఉదాసీనంగా వ్యవహరించే వారిపై సస్పెన్షన్
గోషామహల్‌లో ఉస్మానియా నూతన ఆస్పత్రి
32 ఎకరాల్లో కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో!
50 ఏళ్ల అవసరాలు దృష్టిలో పెట్టుకొని డిజైన్లు
ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి భవనాన్ని పరిరక్షిద్దాం
ఏడాదిలో 15 కొత్త నర్సింగ్ కాలేజీ భవనాలు
ఇరవై రెండు జిల్లాల్లో మహిళా సంఘాలకూ..
'స్పీడ్' పనులపై సమీక్షలో సీఎం నిర్ణయాలు

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించిన సర్కార్.. ఇప్పుడు మరో దరఫా ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమైంది. రేషన్ కార్డు, హెల్త్ కార్డుల కోసం వివరాలు సేకరించనుంది. పూర్తి హెల్త్ ప్రొఫైల్‌తో రాష్ట్రంలో ప్రతి పౌరుడికి హెల్త్ కార్డు మంజూరు చేయాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో అధికారులను సన్నద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.**

హైదరాబాద్,ఆగస్ట్ 27 : మంగళవారం స్పీడ్ (స్మార్ట్ ప్రోయాక్టీవ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ)పై అధికారులతో సీఎం సమావేశమయ్యారు. ఈ భేటీలో అధికారులకు సీఎం కీలక సూచనలు, సలహాలు ఇచ్చారు. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి పది రోజుల పాటు మరోసారి ప్రజాపాలన కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇకపై రేషన్ కార్డులు, హెల్త్ కార్డులకు లింక్ ఉండదని, వేర్వేరుగా కార్డులు జారీ చేస్తామని సీఎం చెప్పారు. ప్రజా పాలనలో ప్రతి కుటుంబం నుంచి అందుకు

మిగతా 2 లో



## కవితకు బెయిల్

ఢిల్లీ మద్యం కేసులో మంజూరు చేసిన సుప్రీం.. తిహాడ్ జైలు నుంచి విడుదల
కవిత పాత్రపై ఈడీ, సీబీఐల దర్యాప్తు ముగిసింది..
ఈ కేసు విచారణ ఇప్పట్లో పూర్తి కాదు
అందుకే బెయిల్ మంజూరు చేస్తున్నామన్న ధర్మాసనం..
ఈడీ, సీబీఐల తీరుపై తీవ్ర వ్యాఖ్యలు

**అయిదు నెలలకు పైగా తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవితకు విముక్తి లభించింది. ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించి నమోదైన మనీలాండరింగ్, అవినీతి కేసుల్లో ఆమెకు సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. విచారణ సందర్భంగా.. కేంద్ర దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీల తీరును అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. నిందితుల్లో ఇష్టానుసారంగా కొందరిని ఎంపిక చేసుకొని అప్రూవర్లుగా మార్చుకోవటం ఏమిటని ప్రశ్నించింది. అలాగే, మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 45(1) కింద మహిళలకు బెయిల్ మంజూరు చేసే నిబంధనను.. కవిత రాజకీయ నాయకురాలు అయినందున వర్తింపజేయలేమన్న ఢిల్లీ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఏ స్థానంలో ఉన్నా మహిళ.. మహిళేనని పేర్కొంది. ఈ మేరకు, బెయిల్ ఇవ్వటానికి నిరాకరిస్తూ హైకోర్టు జూలై 1వ తేదీన ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ కవిత దాఖలు చేసిన పిటిషన్లను ఆమోదిస్తూ బెయిల్ మంజూరు చేసింది.**

న్యూఢిల్లీ, ఆగస్టు 27 : రెండు కేసుల్లోనూ రూ.10 లక్షల చొప్పున పూచీకత్తులు సమర్పించాలని, పాస్‌-పోర్టును విచారణ కోర్టు న్యాయమూర్తి వద్ద డిపాజిట్ చేయాలని, సాక్షులను ప్రభావితం చేయడం కానీ బెదిరించడం కానీ చేయరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కోర్టు విచారణలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని పేర్కొంది. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు

## మాఫీ ప్రక్రియ మధ్యలో ఉంది

వారం పదిరోజుల్లో ఇంటింటి సర్వే పూర్తి
రేషన్‌కార్డు లేని రైతులను గుర్తిస్తాం
మరో 18వేల కోట్లు వారి ఖాతాల్లో జమ చేస్తాం.. మంత్రి తుమ్మల వెల్లడి
వారం పదిరోజుల్లో ఇంటింటి సర్వే పూర్తి
రైతు సంఘాల ధర్నాలో మంత్రి తుమ్మల




హైదరాబాద్, ఖమ్మం, ఆగస్టు 27 : రైతు రుణమాఫీ ప్రక్రియ మధ్యలో ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వా రం పదిరోజుల్లో ఇంటింటి సర్వే పూర్తి చేసి, రేషన్ కార్డు లేని రైతు కుటుంబాలను గుర్తిస్తామని, యాప్ ద్వారా వారికి రు-ణమాఫీ వర్తింపజేస్తామని

మిగతా 2 లో

## ఆపరేషన్ మూసీ!

### 12 వేల కుటుంబాల తరలింపు

సర్వం సిద్ధం చేసిన ప్రభుత్వం
నిరాశ్రయులకు పక్కా ఇళ్లు
తరలింపు వేళ ప్రత్యేక ఆర్థిక సాయం
పట్టా భూములున్న వారికి పరిహారం
టీడీఆర్ బాండ్లు, ఉపాధి అవకాశాలు
ఇప్పటికే పూర్తైన ఇంటింటి సర్వే
నిధుల కోసం రుణం
ఎన్నికల నాటికి ప్రాజెక్టు పూర్తి!



.. వివరాలు 2లో

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
28 ఆగస్టు
2024





# ఆధ్యాత్మికతకు ఆలవాలంగా 'గుట్ట' ఆలయం





### మొదటి పేజీ తరువాయి

అన్నారు. మంగళవారం ఉదయం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. మొదటగా ఆయన విష్ణు పుష్కరిని సందర్శించి స్నాన సంకల్ప పూజలు జరిపారు. తదుపరి అఖండ దీపారాధన పూజ కూడా జరిపి టెంకాయ మొక్కును సమర్పించుకున్నారు. యాదగిరిగుట్ట ఆలయ మహా ద్వారం వద్ద వేద పండితులు దేవస్థానం ఆలయ మర్యాదలతో కార్యనిర్వాహణాధికారి పూర్ణకుంభ స్వాగతంతో ఆలయంలోకి వెళ్లి ప్రత్యేక పూజలు జరిపారు. ఆశీర్వచనం అనంతరం దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు శాలువాతో గవర్నర్ ను సత్కరించారు. దేవస్థానం కార్యనిర్వహణ అధికారి భాస్కరరావు జ్ఞాపికను అందజేయగా అనువంశిక ధర్మకర్త బి నరసింహమూర్తి శ్రీ స్వామివారి ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ ఆలయ సందర్శన వలన పూర్తి ఆధ్యాత్మిక అనుభూతి చెందినట్లు చెప్పారు. అదేవిధంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం కూడా దేశంలోనే ప్రముఖ ఆలయంగా ఆధ్యాత్మిక తన సంతరించుకున్నదని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆలయ నిర్వహణ ఎంతో ప్రశంసనీయంగా ఉన్నదని గవర్నర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అంతకుముందు గవర్నర్ కు శాలువ కప్పి స్వాగతం పలికారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, జిల్లా కలెక్టర్ హనుమంతు జెండాగే, యాదాద్రి డిసిపి రాజేష్ చంద్ర, యాదగిరిగుట్ట దేవస్థానం ప్రధాన అర్చకులు నల్లందిగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూర్ వెంకటాచార్యులు ఆధ్వర్యంలోని అర్చక బృందం ఆయనకు ఆశీర్వచనం జరిపారు.





## 17నుంచి ప్రజాపాలన

### మొదటి పేజీ తరువాయి

అవసరమైన వివరాలను సేకరిస్తామన్నారు. రాష్ట్రమంతటా అన్ని గ్రామాలు, వార్డుల్లో ప్రజా పాలన కార్యక్రమానికి నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తూ, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి ఈ సమావేశంలో పాల్గొన్నారు. హెల్త్ డిజిటల్ కార్డుల జారీకి ఎలాంటి పద్ధతి అనుసరించాలి... ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ను నమోదు చేసేందుకు ఏయే వైద్య పరీక్షలు చేయాలి.. గ్రామాల్లోనే హెల్త్ చెకప్ శిబిరాలు ఏర్పాటు చేయాలా... రాష్ట్రంలో ఉన్న లాబోరేటరీల సాయం తీసుకోవాలా...? వెంటనే పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. హెల్త్ డిజిటల్ కార్డుకు సంబంధించి ఫ్రాన్స్‌లో ఉత్తమమైన విధానం అనుసరిస్తున్నారని ఇటీవల విదేశీ పర్యటనలో తనను కలిసిన ప్రతినిధులు చెప్పారని, అక్కడ అనుసరించే విధానాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య సేవలకు, సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించేందుకు ఇకపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే హెల్త్ కార్డు ప్రామాణికంగా ఉంటుందని సీఎం అన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డెంగ్యూ, చికున్ గున్యా, వైరల్ జ్వరాలతో వివిధ ఆసుపత్రుల్లో పెరుగుతున్న కేసులపై ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాదులు రాకముందే తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్తో పాటు రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో దోమల నిర్మూలనకు ఫాగింగ్, స్ప్రే ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని, ఎప్పటికప్పుడు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు చేయాలని సీఎం ఆదేశించారు. పని చేయని ఉద్యోగులను, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేపట్టే చర్యల పట్ల ఉదాసీనంగా వ్యవహరించే వారిని సస్పెండ్ చేయాలని సీఎం హెచ్చరించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ సమన్వయంతో పని చేయాలని సీఎం ఆదేశించారు. అవసరమైతే పోలీసు విభాగం, స్వచ్ఛంద సంస్థలు, మీడియా సహకారంతో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని జిల్లాల్లోనూ కలెక్టర్లు, పంచాయతీరాజ్ అధికారులు సీజనల్ వ్యాధులపై వెంటనే ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. అన్ని జిల్లాల్లో కలెక్టర్లు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని, పలు గ్రామాలు, పట్టణాలకు వెళ్లి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. డెంగ్యూ, చికున్ గున్యా కేసులు నమోదైన ప్రాంతాలకు వెళ్లి కారణాలను గుర్తించాలని, అవసరమైన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే, హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్‌కు తరలించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఇందుకు సంబంధించి భూ బదలాయింపు కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఆస్పత్రి నిర్మాణానికి ఆర్కిటెక్ట్‌తో డిజైన్లు రూపొందించాలన్నారు. వచ్చే 50 ఏళ్లను దృష్టిలో ఉంచుకుని ఆస్పత్రిని నిర్మించాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా డిజైన్లు ఉండాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా రోడ్ కనెక్టివిటీ ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

# కవితకు బెయిల్

### మొదటి పేజీ తరువాయి

చేసిన నేపథ్యంలో, స్థానిక ఢిల్లీ కోర్టు జైలు నుంచి కవిత విడుదలకు అనుమతిస్తూ రిలీజ్ వారెంట్లను జారీ చేసింది. దీంతో తిహాడ్ జైలు నుంచి కవిత విడుదలయ్యారు.

**కవితపై దర్యాప్తు పూర్తయ్యింది!**

జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం కవితకు బెయిల్ ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తూ అందుకుగల కారణాలను వివరించింది. ఢిల్లీ మద్యం కేసులో కవితకు సంబంధించి ఈడీ, సీబీఐ దర్యాప్తు ఇప్పటికే పూర్తి చేశాయని గుర్తు చేసింది.

కాబట్టి, ఆమె ఇంకా కస్టడీలో (జైలులో) ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ కేసుపై ఢిల్లీ స్థానిక కోర్టులో జరుగుతున్న విచారణను ప్రస్తావిస్తూ.. కేసులో మొత్తం 493 మంది సాక్షులున్నారని, 50 వేల పేజీల పత్రాల ఆధారాలు ఉన్నాయని.. అంతమంది సాక్షులను విచారించి, ఆయా ఆధారాలను కింది కోర్టు పరిశీలించి విచారణను పూర్తి చేయటం సమీప భవిష్యత్తులో సాధ్యమయ్యే విషయం కాదని తేల్చి చెప్పింది. కాబట్టే, కవితకు బెయిల్ మంజూరు చేస్తున్నామని తెలిపింది.

**మీ దర్యాప్తు నిజాయితీగా లేదు!**

విచారణ సందర్భంగా సీబీఐ, ఈడీ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపిస్తూ.. కేసులో కొందరు అప్రూవర్లు కవితకు వ్యతిరేకంగా సాక్ష్యమిచ్చారని పేర్కొన్నారు. ఒక అప్రూవర్ చెప్పిన అంశాలను చదివి వినిపించారు. దీనిపై దర్మాసనం తీవ్రంగా స్పందించింది. 'మీరు నిజాయితీగా ఉండాలి. కేసులో నిందితుడైన వ్యక్తినే సాక్షిగా మారుస్తున్నారు. రేపు ఎవరినైనా మీ ఇష్ట ప్రకారం ఎంచుకుని అప్రూవర్‌గా తీసుకోవచ్చు. ఇతరులను నిందితులుగా పేర్కొనవచ్చు. ఇదేం పద్ధతి? ఈ విధంగా మీరు వ్యవహరించలేరు. మీరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని చాలా స్పష్టంగా, సహేతుకంగా తెలుస్తోంది. ఇలాంటిది చూడాల్సి వచ్చినందుకు చింతించాల్సి వస్తోంది' అని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్వీ రాజు జోక్యం చేసుకోబోయారు. దీనిపై జస్టిస్ గవాయ్ స్పందిస్తూ.. 'మీరు ఇంకా వివరాల్లోకి వెళ్తామంటే.. మేం కూడా అన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటాం. దర్యాప్తు సంస్థల నిజాయితీ, నిష్పాక్షికతలను పరిశీలించాల్సి ఉంటుంది. మీరు వినాలనుకుంటే మరింత సేపు వాదించండి' అని స్పష్టం చేశారు. దీంతో కవితకు బెయిల్ ఇవ్వొద్దని దాదాపు గంటపాటు వాదించిన ఎస్వీ రాజు మిన్నకుండిపోయారు. అంతకుముందు, కవితను ప్రశ్నించటానికి సమన్లు జారీ చేసినప్పుడే ఆమె తన సెల్‌ఫోన్‌లో కాల్ రికార్డులను, ఫేస్‌టైమ్ డాటాను తొలగించి ఫార్మాట్ చేశారని ఎస్వీ రాజు తెలిపారు. దీనిపై జస్టిస్ విశ్వనాథన్ స్పందిస్తూ.. ఫోన్ అనేది ప్రైవేటు ఉపకరణమని, ఎవరైనా ఫోన్‌లోని వివరాలు ఇతర్లతో పంచుకుంటారా అని ప్రశ్నించారు.

ఫోన్‌లోని మెసేజీలను తొలగించడం మామూలేనని, తనకు కూడా ఆ అలవాటు ఉందన్నారు. స్కూలు, కాలేజీ గ్రూపులు ఎన్నో మెసేజీలను పోస్టు చేస్తుంటాయి.. వాటిని తొలగించటం సాధారణ విషయమన్నారు. అయితే మొత్తం డాటాను తొలగించటం సాక్ష్యాలను ధ్వంసం చేయడమేనని, కవిత చాలా సున్నితమైన డాటాను డిలీట్ చేశారని, దీనిని సాధారణ ఫార్మాటింగ్‌గా భావించరాదని రాజు అన్నారు. దీనికి జస్టిస్ గవాయ్ స్పందిస్తూ.. 'మీరు నేరం రుజువు చేయకముందే నేరం చేశారని భావిస్తున్నారు. ఆమె నేరం చేసినట్లు మీ వద్ద సాక్ష్యాలేమున్నాయి' అని ప్రశ్నించారు.

**అందరూ సమానమంటారు కదా?**

విచారణ సందర్భంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) సెక్షన్ 45(1)పై ధర్మాసనం ప్రత్యేకంగా దృష్టి సారించింది. మహిళలకు బెయిల్ ఇచ్చే అంశంలో చట్టం కొన్ని మినహాయింపులు ఇచ్చిందని.. పీఎంఎల్ఏ సెక్షన్ 45(1) కూడా అదే విషయాన్ని ప్రస్తావిస్తోందని తెలిపింది. ఈ సెక్షన్ ప్రకారం.. నిందితుడు నేరానికి పాల్పడలేదని, బెయిల్ మీద విడుదలైతే ఎటువంటి నేరానికి పాల్పడే అవకాశం లేదని న్యాయమూర్తి భావించినప్పుడు బెయిల్ ఇవ్వవచ్చు.

అయితే, మహిళలతోపాటు కొన్ని వర్గాల నిందితులకు ఈ రెండు షరతులను కూడా పక్కనపెట్టి బెయిల్ ఇచ్చే అవకాశం సెక్షన్ 45(1) కల్పిస్తోంది. దీనికి అనుగుణంగా తనకు బెయిల్ ఇవ్వాలని ఢిల్లీ హైకోర్టును కవిత తరఫు న్యాయవాదులు కోరినప్పుడు.. 'కవిత ఉన్నత విద్యావంతురాలు. రాజకీయాల్లో, సామాజికసేవలో తనదైన ముద్ర వేశారు. కాబట్టి, ఆమెను అణచివేతకు గురైన ఓ సాధారణ మహిళగా చూడలేం' అంటూ హైకోర్టు బెయిల్‌ను నిరాకరించింది. దీనిపై సుప్రీంకోర్టు మంగళవారం తీవ్రంగా స్పందించింది.

అందరినీ సమానంగా చూడాలని, సీఎం అయినా ఎంపీ అయినా ఎటువంటి మినహాయింపు ఇవ్వరాదని దర్యాప్తు సంస్థలు తమ ఎదుట తరచూ వాదిస్తున్న సంగతిని గుర్తు చేసింది. ఇదే కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రచారం చేసేందుకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరితే సీబీఐ, ఈడీలు అందుకు అభ్యంతరం తెలుపుతూ.. సీఎం అయినా, సాధారణ వ్యక్తి అయినా ఒక్కటేనని వాదించాయి.సుప్రీంకోర్టు తాజాగా దీనినే పరోక్షంగా ప్రస్తావించింది. కవితను అందరు మహిళలతో సమానంగా హైకోర్టు చూడలేదని, ఆమెకు సెక్షన్ 45(1) ద్వారా లబ్ధి జరగకుండా అడ్డుకోవటం ద్వారా తీర్పు విషయంలో హైకోర్టు పూర్తిగా తప్పుదోవపట్టిందని సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది.

# రాజముద్రనే మార్చేస్తారా ?

### మొదటి పేజీ తరువాయి

దీన్ని వాడారన్నారు. దీనికి కారకులెవరో కనుక్కుని వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈరాజముద్రను అధికారులు ఇష్టారీతిగా వినియోగిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని తక్కువ చేసేలా రాజముద్రలో మార్పులు చేసే ప్రతిపాదన ముందుకు తెచ్చింది. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మాత్రం అత్యుత్సాహం చూపి రాజముద్రను మార్చారు. ఎల్ఆర్ఎస్‌పై సందేహాల నివృత్తి కోసం ప్రభుత్వం అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సోమవారం హెల్ప్ డెస్క్ బ్యానర్ ఏర్పాటు చేశారు. ఇందులో తెలంగాణ రాజముద్ర మార్చేశారు. అధికారిక రాజముద్ర కాకుండా కొత్తగా చేసి పెట్టారు. అధికారులు రాజముద్రను మార్చడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం వరంగల్ చారిత్రక గొప్పదనాన్ని తెలిపేలా రాజముద్రలో కాకతీయ కళాతోరణాన్ని పెడితే, మున్సిపల్ కార్పొరేషన్ విరుద్ధంగా వ్యవహరించిందని విమర్శిస్తున్నారు. వరంగల్ నగర ఔన్నత్యాన్ని తగ్గించేలా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# మాఫీ ప్రక్రియ మధ్యలో ఉంది

### మొదటి పేజీ తరువాయి

చెప్పారు. మిగిలిన రూ.18 వేల కోట్ల రుణమాఫీ సొమ్ము తప్పకుండా రైతు ఖాతాల్లో జమచేసి తీరుతామని, ఎవరూ ఆందోళన చెం దాల్సిన అవసరం లేదన్నారు. షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖమ్మం కలెక్టరేట్ వద్ద సీపీఎం, సీపీఐ రైతు సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా వద్దకు చేరుకున్న మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత ఐదేళ్లుగా 42 లక్షల మంది రైతులకు సంబంధించి రూ.2 లక్షల లోపు మొత్తం రూ.31వేల కోట్ల రుణబాకీ ఉందని తెలిపారు. ఆయా బ్యాంకులు ఇచ్చిన జాబితాల ప్రకారంగానే దశలవారీగా రైతు రుణమాఫీ చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికీ రాష్ట్రంలో రూ.2లక్షలలోపు రుణాలున్న 22 లక్షలమంది రైతుల బ్యాంకు ఖాతాల్లో మాఫీ నిధులు జమ చేసినట్లు తెలిపారు. ఇంకా రూ.18వేల కోట్లు జమ చేయాల్సి ఉందన్నారు. ఇంటింటి సర్వే ద్వారా రేషన్‌కార్డు లేని రైతు కుటుంబాలను నిర్ధారణ చేసి యాప్ ద్వారా పాస్‌బుక్ ఆధారంగా రుణమాఫీ చేస్తున్నామని తెలిపారు. రూ.2 లక్షలపైన బకాయి ఉన్నవారు సుమారు 12వేల మంది రైతులున్నారని, త్వరలో మంత్రివర్గ భేటీలో వీరిందరి విషయంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

**బ్యాంకు డేటాలో తప్పులుంటే సరిచేయాలి**

రైతులు రుణమాఫీ పథకానికి అర్హులై బ్యాంకుల నుంచి వచ్చిన డేటాలో తప్పులుంటే సరిచేయాలని మంత్రి తుమ్మ ల అధికారులను ఆదేశించారు. కుటుంబ సభ్యులు నిర్ధారణ కాని రైతులకోసం ప్రత్యేక యాప్ రూపొందించామని తెలిపారు. ఈనెల 25, 26 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో ట్రయల్ రన్ చేసినట్లు తెలిపారు. నేటినుంచి రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో మండల వ్యవసాయశాఖ అధికారులు(ఏవో)లు ఇంటింటి సర్వే నిర్వహించి వివరాలు అప్‌లోడ్ చేస్తారని తెలిపారు.

మంగళవారం రైతువేదికల్లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లలో ఉన్న ఏఈవోలు, ఏవోలతో మంత్రి తుమ్మల మాట్లాడారు. ఆగస్టు 15 నాటికి 22,37,848 లక్షల మంది రైతులకు 2 లక్షల లోపు ఉన్న పంట రుణమాఫీ చేశామని తెలిపారు. రేషన్ కార్డులు లేకుండా కుటుంబ నిర్ధారణ కాని రైతుల వివరాలు సేకరించి పోర్టల్‌లో నమోదు చేయటం జరుగుతుందన్నారు. తప్పుగా నమోదైన 1,24,604 ఆధార్ వివరాలను బ్యాంకులకు సరిచేయడానికి ఇచ్చామని, ఇప్పటివరకు 41,339 ఆధార్ వివరాలను సరిచేసినట్లు తెలిపారు.

# ఆపరేషన్ మూసీ!

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 27 : మూసీనదికి పూర్వ వైభవాన్ని కల్పించాలని కంకణబద్ధమైన రేవంత్ సర్కారు.. పక్కా ప్రణాళికతో ముం దుకు సాగుతోంది. 'ఆపరేషన్ మూసీ'కి సన్నాహాలు చేస్తోంది. మూసీ పరీవాహక ప్రాంతాల్లో బఫర్ జోన్ల లో నివసిస్తున్న 12 వేల కుటుంబాలను తరలించాల ని నిర్ణయించింది. అంతర్గతంగా చేసిన కసరత్తు ఇప్పటికే ఓ కొలిక్కి రాగా.. కార్యాచరణకు అవసరమయ్యే నిధులను రుణంగా తీసుకోవాలని భావిస్తోంది.

**పూర్తయిన సర్వే..**

అనంతగిరి కొండల్లో పుట్టిన మూసీనది గండిపేట వరకు స్వచ్ఛంగానే ఉంటోంది. అక్కడి నుంచి ఘట్‌కేసర్ వరకు సుమారు 55 కిలోమీటర్ల మేర ఆక్రమణలతో కుంచించుకుపోయింది. మురుగునీటితో కలుషితమవుతోంది. లండన్‌లోని థేమ్స్ నది మాదిరిగా.. మూసీ సుందరీకరణకు సిద్ధమైన రేవంత్ ముందు వేల కుటుంబాలను తరలించడం ఒక పెద్ద సవాలు గా ఉంది.

సర్వే దాదాపు పూర్తయినా.. కార్యాచరణకు నిధులు సమకూరితే.. చకచకా పనులు సాగిపోయేలా పక్కా ప్రణాళికను సిద్ధమైంది. మూసీ సుందరీకరణకు బఫర్ జోన్‌లో ఆక్రమణలను తొలగించడంతోపాటు.. కొంత భూసేకరణ అవసరం. ఈ నేపథ్యంలో అధికారులు బఫర్-జోన్‌ను ఆక్రమించుకుని, నివసిస్తున్న కుటుంబాలెన్ని? నదిని ఆక్రమించిన కుటుంబాలెన్ని? సుందరీకరణకు అదనంగా ఎంత మేర భూసేకరణ అవసరం? అనే అంశాలపై సర్వే పూర్తి చేశారు.

**తరలింపే అతి పెద్ద సవాలు**

అధికారుల సర్వేలో.. మూసీ సుందరీకరణకు రాజేంద్రనగర్ అసెంబ్లీ సెగ్మెంట్ మొదలు.. మేడ్చల్ నియోజకవర్గంలోని ఘట్‌కేసర్ వరకు సుమారు 12 వేల కుటుంబాలను తరలించాల్సి ఉంటుందని అంచ నా వేశారు. ఈ ప్రక్రియ పూర్తయితేగానీ, అడుగు ముందుకు పడని పరిస్థితి..! ఈ నేపథ్యంలో ఎదుర య్యే సమస్యలేంటి? తెరపైకి వచ్చే డిమాండ్లు ఏమి టి? ఎలా సంసిద్ధమవ్వాలి? అనే అంశాలపై అధికారు లు దృష్టి సారించారు. ఎలాంటి వ్యతిరేకత ఎదురవ్వకుండా.. ఓ ప్యాకేజీని సిద్ధం చేశారని సమాచారం. తరలించాల్సిన కుటుంబాల సామాజిక-ఆర్థిక పరిస్థితులను గుర్తించి, దారిద్ర్యరేఖకు దిగువన, ఎగువన ఉన్న కుటుంబాల చిట్టాను సిద్ధం చేశారని తెలిసింది.

**సంతృప్తికరమైన ప్యాకేజీతో..**

సర్వేలో గుర్తించిన 12 వేల కుటుంబాలు.. ఇళ్లను, వాణిజ్య సముదాయాలను నిర్మించుకున్న భూములు వేర్వేరు కేటగిరీల్లో ఉన్నాయి. పట్టా భూములతో పాటు.. ప్రభుత్వ, దేవాదాయ, పట్టణ భూపరిమితి చట్టం, వక్ఫ్, అసైన్డ్, ఇనాం, మూసీ బఫర్‌జోన్ భూ ములు ఉన్నట్లుగా నిర్ధారించారు. సర్వేలో భాగంగా వాణిజ్య సముదాయాల్లో వ్యాపారులపైనా దృష్టి సా రించారని తెలిసింది. వారి వ్యాపార పరిధి ఎంత వర కు ఉంది? టర్నోవర్ ఎంత? అనే వివరాలను సేకరించారు. భూములు, వాణిజ్య సముదాయాల వారీగా తరలింపుపై సంతృప్తికరమైన ప్యాకేజీలతో ముందు కెళ్లాలని సర్కారు నిర్ణయించింది.

తరలింపు సమయంలో ఎదురయ్యే సవాళ్లు, కోర్టు కేసుల విషయంలోనూ ఎలా ముందుకు సాగాలి? అన్నదానిపై అధికా రులు పక్కా ప్రణాళికతో ఉన్నట్లు సమాచారం. ఈ క్ర మంలో ఇళ్లను పోగొట్టుకునే వారికి.. వారు ఉంటున్న ప్రాంతాల సమీపంలోనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని ప్రభుత్వం భావిస్తోంది. కొందరికి టీడీఆర్ బాండ్లను ఇవ్వాలని నిర్ణయించింది.

వాణిజ్య సముదాయాల యజమానుల విషయంలోనూ ప్రత్యే క ప్యాకేజీతో ముందుకు వెళ్లనున్న ట్లు తెలుస్తోంది. సంతృప్తికరమైన ప్యాకేజీతో 12 వేల కుటుంబాలు స్వచ్ఛందంగా తరలివెళ్లేలా చర్యలు తీసుకుంటోంది. ఇక ఈ ప్యాకేజీలకు, మూసీ సుందరీకరణకు కావాల్సిన నిధులను రుణాల రూపంలో స మకూర్చుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. వచ్చే అసెంబ్లీ ఎన్నికలనాటికి ఈ ఆపరేషన్ ను పూర్తిచేయాలని కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిసింది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
28 ఆగస్టు
2024






# ఎస్.వీ.ఎన్‌లో ఘనంగా జన్మాష్టమి

## శ్రీకృష్ణుని వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు

## రేపల్లెను తలపించిన ఎస్.వీ.ఎన్

## శ్రీకృష్ణుడు... గోపికలతో చిన్నారుల సందడి

## జన్మాష్టమి అలంకరణ సూపర్

యాదగిరిగుట్ట, ఆగస్టు 27 (రోమింగ్ న్యూస్): యాదగిరిగుట్ట పట్టణంలోని ఎస్.వీ.ఎన్ డిజిటల్ హైస్కూల్ , వండర్ కిడ్స్ ప్లే స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రీ ప్రైమరీ స్టూడెంట్స్ శ్రీకృష్ణులు... గోపికలుగా సందడి చేశారు. ఎస్.వీ.ఎన్ ప్రాంగణం రేపల్లెను తలపించింది. వందలాది మంది స్టూడెంట్స్ శ్రీకృష్ణులు... గోపికలుగా మ-ంస్తాబయి పాఠశాలలో కనువిందు చేశారు. రేపల్లెలో కృష్ణుడు పెరిగిన వాతావరణ ఎస్.వీ.ఎన్ లో ఆవిష్కరణ చేశారు.వెన్న తినే కృష్ణుడు... వెన్నను చిలికి అందించే గోపికలు... అమ్మ యశోధ నుంచి కన్నయ్య పారిపోయే చిలిపి సన్నివేశాలను చిన్నారులతో ప్రిన్సిపాల్ గొట్టిపర్తి మాధురి ఆసక్తికరంగా ప్రదర్శించేలా ఏర్పాటు చేశారు. గోపికలు వెన్న చిలకడం వారికి తెలియకుండా శ్రీకృష్ణుడు వెన్నను తినడం ఆసక్తికరంగా చిన్నారుల హావభావాలతో రక్తి కట్టించారు. కృష్ణ జన్మాష్టమిని జన్మాష్టమి.. లేదా గోకులాష్టమి లేదా అష్టమి రోహిణి అని కూడా పిలుస్తారు. ఈ విషయాలను ప్రిన్సిపాల్ మాధురి చిన్నారులకు అర్ధమయ్యే విధంగా వివరించారు. శ్రీమహా విష్ణువు అవతారం లో ఎనిమిదవది శ్రీకృష్ణ అవతారం. శ్రీకృష్ణుడు విశ్వ గురువుగా భగవద్గీతను ప్రపంచానికి అందించిన విశిష్టమైన అవతారం. కలియుగంలో కల్మషాల్నిహరించి పుణ్యాల్ని ప్రసాదించే పర్వదినంగా జన్మాష్టమి పిలుస్తారు. దుష్ట శిక్షణ... శిష్ట రక్షణ అన్న గీతోపదేశంతో మానవాళికి దిశా నిర్దేశం చేసిన శ్రీకృష్ణ భగవానున్ని ఆయన లీలలను ప్రిన్సిపాల్ మాధురి వివరించారు. జీవితానికి సరిపడా విలువలు శ్రీకృష్ణుని ద్వారా ఈ ప్రపంచానికి అందినాయనీ, కృష్ణుడి మహోన్నత వ్యక్తిత్వం ద్వాపరంలో కృష్ణుడు జన్మించినా నేటికీ కలియుగంలో కృష్ణుని ఆదర్శంగా కొలుస్తున్న వైనాన్ని ఆమె తన ప్రసంగంలో పేర్కొన్నారు.

**గోపికలు... కృష్ణునిగా తయారు చేయడంలో పోటీపడిన పేరెంట్స్**

చిన్నారులను తయారు చేయడంలో పిల్లల పేరెంట్స్ ఎంతో చొరవ చూపించారు. తమ పిల్లల్ని కృష్ణులు... గోపికలుగా తయారు చేయించి ఆకట్టుకునే ఆభరణాలతో వారికి అలంకరణ చేసి మరీ తీసుకువచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులు వారికి మెరుగులు దిద్దారు. దీంతో చూడముచ్చటగా కార్యక్రమం లో చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. జయ జనార్ధన... యశోదమ్మ ఒడిలోన చూడరండమ్మా... గోపాల... గోపాల కృష్ణ కృష్ణ.. ముకుందా పాటలపై చిన్నారుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

**జన్మాష్టమి సందర్భంగా ఆకట్టుకున్న అలంకరణ**

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా పాఠశాలలో చేసిన అలంకరణ ఎంతగానో ఆకట్టుకున్నది ఊయలలో చిన్ని కృష్ణుడు ఊగుతున్నట్లుగా వెన్న చిలికేందుకు ఏర్పాటు చేసిన కుండల సన్నివేశం... అదే విధంగా శ్రీకృష్ణుని చిత్రపటం చుట్టూ చేసిన అలంకరణ పేరెంట్స్ ను ఎంతగానో ఆకట్టుకున్నది.





























ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
28 ఆగస్టు
2024



# నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించాలి..

## నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా




శ్రీశైలం, ఆగస్టు 27 ( రోమింగ్ న్యూస్) రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.....నైట్ బీట్, పెట్రోలింగ్ పెంచి నేరాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి...పరిశ్రమలలో జరిగే ప్రమాదాలపై అవగాహన కలిగి ఉంది ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.....మట్కా, జూదం చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా ఉండాలి......ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశంలో ఆదేశాలు జారీ చేసిన జిల్లా ఎస్పీ గారు.నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా నేడు నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం వద్దగల జిల్లా పోలీస్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్ నందు నేర సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ పోలీస్ అధికారులు మరియు సిబ్బంది ప్రజల మధ్య ఉంటూ నేరాలు జరగకుండా చూస్తూ ఫ్రెండ్లీ పోలిసింగ్ పై దృష్టి ఉంచాలని, విజిబుల్ పోలీసింగ్ పై పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ సిస్టం లో వచ్చే ఫిర్యాదులు ప్రాధాన్యతనిస్తూ చట్టపరిధిలో నిర్ణిత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు.పట్టణంలో మరియు గ్రామాలలో స్కూల్లో వద్ద, కళాశాల వద్ద, ముఖ్యమైన కూడళ్ళలో, పట్టణ శివారులలో నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలి. హైవే ప్రాంతాలు ఎక్కువగా ఉన్నందున రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలి అందులో భాగంగా బ్లాక్ పాయింట్స్ వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలి, టర్నింగ్ లలో, ముఖ్యమైన ప్రాంతాలలో సిగ్నల్ బోర్డ్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలి. హైవే మొబైల్స్ సహకారంతో హైవేలలో జరిగే దొంగతనాలపై నిఘా ఉంచి నివారణ చర్యలు తీసుకోవాలి.

పట్టణాలు గ్రామాలలో సమస్తత్మక ప్రాంతాలను గుర్తించి నేరాలు జరగకుండా కమ్యూనల్ గొడవలు జరగకుండా సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, భూతగాదాలు , గంజాయి, అక్రమ మద్యం మొదలగునవి జరగకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.చట్ట ప్రకారం నివారణ చర్యలు తీసుకోని వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.ఆళ్లగడ్డ సబ్ డివిజన్లోని పరిశ్రమలలో జరిగే ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండి నివారణ చర్యలతో పాటు ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు తీసుకోవలసిన భద్రత చర్యలపై యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలి.

త్వరలో జరగనున్న వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసే వినాయక విగ్రహాలకు సంబంధించి కమిటీలు ఏర్పాటు చేసుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. చాలాకాలం పెండింగ్లో ఉన్న పలు కేసులు వివరాలు తెలుసుకొని దర్యాప్తు తొందరగా ముగించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి సంతోష్ గారు, ఆళ్లగడ్డ డి.ఎస్.పి రవికుమార్ గారు, సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్టుకు సన్మానం




కేసముద్రం ఆగస్టు 27 (రోమింగ్ న్యూస్): నైజాం సర్కార్ పరిపాలనలో తెలంగాణ ప్రాంతంలో తొలి తెలుగు వార్తా పత్రిక 'తెనుగు' పత్రిక ఆవిర్భవించి 102 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో మంగళవారం ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఉమ్మడి కేసముద్రం మండల సీనియర్ జర్నలిస్టు బండి సంపత్ కుమార్,వేల్పుల రాజమల్లు యాదవ్ లను ఒద్దిరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఇనుగుర్తి గ్రామానికి చెందిన సాహితీవేత్తలు ఒద్దిరాజు సీతారామచంద్రరావు,రాఘవ రంగారావులు ఇనుగుర్తిలో 1922 ఆగస్టులో తెనుగు పత్రికను ముద్రించారు. ఎలాంటి సౌకర్యాలు లేని సమయంలో అత్యంత శ్రమకోర్చి మద్రాసు నుంచి పెడస్టల్ ప్రింటింగ్ మిషన్ ఇనుగుర్తిలో పత్రికను ముద్రించారు.నైజాం సర్కార్కు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించడానికి తెనుగు పత్రిక ఎంతో దోహద పడింది.పత్రిక ద్వారా ప్రజల్లో చైతన్య వస్తున్న విషయాన్ని గుర్తించిన నైజాం సర్కార్ తెనుగు పత్రిక పై కక్ష కట్టింది. అయినప్పటికీ మొక్కవోని ధైర్యంతో ఒద్దిరాజు సోదరులు పత్రికను దాదాపు ఆరేండ్లపాటు నిర్వహించి ఆ తర్వాత వరంగల్ కు తరలించగా కొద్ది నెలలకే మూతపడింది.ఒద్దిరాజు సోదరుల సాహిత్య స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు వారి వంశానికి చెందిన ఒద్దిరాజు సుభాష్ చంద్ర ఆధ్వర్యంలో చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశారు.ఇందులో భాగంగా తొలిసారి ఇనుగుర్తిలో శత సంవత్సర వేడుకలు నిర్వహించి సీనియర్ పాత్రికేయుడు,మన తెలంగాణ ఎడిటర్ దేవులపల్లి అమర్ ముఖ్య అతిథిగా ఆహ్వానించి ఈ ప్రాంత సీనియర్ జర్నలిస్టులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 30 ఏళ్లకు పైగా కేసముద్రం ప్రాంతంలో ప్రజల సమస్యల పరిష్కారం,అనేక మానవీయ ఘటనలను తమ రచనల ద్వారాబాహ్య ప్రపంచానికి వివరించి ఎందరికో సహాయ సహకారాలు, అభివృద్ధికి కృషి చేసిన సీనియర్ జర్నలిస్టులు బండి సంపత్ కుమార్, వేల్పుల రాజమల్లు యాదవ్, మహబూబాబాద్ కు చెందిన పరకాల రవీందర్ ను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు కిషన్,మాజీ సర్పంచ్ దార్ల రామ్మూర్తి, ఒద్దిరాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సుభాష్ చంద్ర, ప్రతినిధులు చంద్రప్రకాష్, వేణుగోపాల్ రావు, సీతారామచంద్రరావు,అనిల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి

## ప్రమాద సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టండి.జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




శ్రీశైలం, ఆగస్టు 27 ( రోమింగ్ న్యూస్ ) జిల్లాలోని అన్ని ఫ్యాక్టరీలు, పరిశ్రమల్లో భద్రత భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించి ఉద్యోగులు, కార్మికుల రక్షణకు అధిక ప్రాధాన్యతనివ్వాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత నిర్వాహకులను సూచించారు.మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఇటీవల జరిగిన ప్రమాద ఘటన నేపథ్యంలో జిల్లాలోని ఫ్యాక్టరీలు, పరిశ్రమల నిర్వాహకులు, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఫ్యాక్టరీలు, పరిశ్రమలలో అంతర్గత సేఫ్టీ ఆడిట్ త్వరితగతిన నిర్వహించి గుర్తించిన లోపాలను సరి చేస్తూ భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అన్ని రకాల పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని, నిబంధనలు అతిక్రమించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. జిల్లాలో ఉన్న 32 ఫ్యాక్టరీలు, 1500 సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలలో పనిచేస్తున్న 28,000 మంది ఉద్యోగుల భద్రతతో పాటు ఆరోగ్య పరిరక్షణకు కూడా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అన్ని చోట్లా మాక్ డ్రిల్స్ కండక్ట్ చేయాలని, ప్రమాదాలపై కార్మికులకు, సమీప నివాసితులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి కంపెనీ పరిసరాల్లో అలారం సిస్టం తప్పకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. లాభాపేక్ష కాకుండా కార్మికుల సంక్షేమం, రక్షణను దృష్టిలో పెట్టుకొని వ్యవహరించాలని హితవు పలికారు. జిల్లాలోని అన్ని పారిశ్రామిక యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్ పాయింట్లను సంబంధిత విభాగాల అధికారులు తరచూ తనిఖీలు చేపట్టాలని, లోపాలుంటే తక్షణమే సరిదిద్దేలా యాజమన్యాలకు నోటీసులు ఇవ్వాలని చెప్పారు. 33 శాతం గ్రీనరీ మెయింటైన్ చేసేలాగా చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. అనుకోని ఘటనలు సంభవించినప్పుడు స్వీయ రక్షణ పొందేలా కార్మికులకు, ఉద్యోగులకు శిక్షణ ఇప్పించాలని చెప్పారు. అలాగే అధికారులు నిబంధనల అమలు విషయంలో రాజీపడొద్దని హితవు పలికారు.జిల్లాలో పారిశ్రామిక యూనిట్ల నెలకొల్పనకు అధిక అవకాశాలు ఉన్నాయని.... ఈ మేరకు సంబంధిత అధికారులు మరింత సమర్థవంతంగా పనిచేస్తూ ప్రతి ఏడాది 15% వృద్ధి వృద్ధిరేటుతో మెరుగైన ర్యాంకింగ్ సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంఎస్ఎంఈ రంగంలో మన జిల్లా దిగువ స్థానంలో ఉందని ఆమె గుర్తు చేశారు.జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ పరిశ్రమల్లో సంభవించే ప్రమాదాల భద్రతా ప్రమాణాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చట్ట ప్రకారం నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రతిస్పందన, స్వీయ రక్షణపై కార్మికులు, ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. సేఫ్టీ మెకానిజం డెవలప్ చేయడంతో పాటు ఎస్ఓపి ప్రకారం నిబంధనలను పాటిస్తూ కంటింజెంట్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు.ఈ సమావేశంలో డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ వై. శ్రీనివాసరెడ్డి, అగ్నిమాపక అధికారి జి.బాలరాజు, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మునిప్రసాద్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి, జిల్లా పరిశ్రమల మేనేజర్ శ్రీనివాస యాదవ్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బహిరున్నిసా బేగం తదితరులు పరిశ్రమలలో చట్టపరమైన అంశాలపై వివరించారు.

# శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి సన్నిధిలో నంద్యాల మార్కెట్ ప్రసాద్



శ్రీశైలం, ఆగస్టు 27 ( రోమింగ్ న్యూస్ ) : చిత్తూరు జిల్లా, ఐరాల మండలం, సత్య ప్రమాణములకు ప్రసిద్ధి చెందిన కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి మంగళవారం నంద్యాల మార్కెట్ ప్రసాద్ వెళ్లారు . దేవస్థానం వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. మార్కెట్ ప్రసాద్ కు . దేవస్థానం కార్యనిర్వాహణాధికారి మరియు డిప్యూటీ కలెక్టర్ శ్రీ %ఖ%. వాణి గారిచే గౌరవపూర్వకంగా మెమొంటో బహుకరించారు .ఈ ఆలయంలో వినాయక చవితి సందర్భంగా వినాయక స్వామి బ్రహ్మోత్సవాలు 21రోజులు పాటు ఘనంగా జరుగుతాయని . స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించ బడునని తెలిపారు . ఈ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తన వంతుగా కూరగాయల వితరణ చేస్తానని మార్కెట్ ప్రసాద్ అధికారులకు హామీ ఇచ్చారు, ఇందుకు అవకాశం ఇచ్చిన అధికారులకు మార్కెట్ ప్రసాద్ ధన్యవాదములు తెలిపారు. వారి వెంట ఆలయ అధికారులు ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, ధనుంజయ, పర్యవేక్షకులు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్స్ విగ్నేష్, రవి, పాల్గొన్నారు.

# శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి సన్నిధిలో ఆగస్టు 29న స్వర్ణరథోత్సవం




శ్రీశైలం, ఆగస్టు 27 ( రోమింగ్ న్యూస్ ) : దేవస్థానం వైదిక కమిటీ వారి సూచన మేరకు ప్రతీమాసములో వచ్చే ఆరుద్రా నక్షత్రం రోజున శ్రీస్వామిఅమ్మవార్ల స్వర్ణరథోత్సవం నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది. లోకకల్యాణార్థం ప్రతీమాసం ఈ స్వర్ణరథోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుంది.కాగా ఈ నెల 29న ఆరుద్రానక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం 7.30 గంటలకు ఈ స్వర్ణ రథోత్సవం జరిపించబడుతుంది. ఆలయమాడవీధులలో ఈ స్వర్ణరథోత్సవం జరుగునున్నది ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆ రోజు ముందుగా వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడుతాయి. అనంతరం 7.30 గంటలకు ఆలయమాడవీధులలో స్వర్ణరథోత్సవం జరిపించబడుతుంది. కావున భక్తులందరు కూడా ఈ స్వర్ణరథోత్సవంలో పాల్గొని తరించగలరని కోరుచున్నాము.

# పోయిన ఫోన్‌ని పట్టుకొని భాదితుడికి అప్పగించిన పోలీసులు



భువనగిరి ,ఆగస్టు27(రోమింగ్ న్యూస్) : పోయిన ఫోన్ ని పట్టుకొని భాదితుడికి పోలీసులు అప్పగించారు. ఈ నెల 11న భువనగిరి కి చెందిన షేక్ సలీం భువనగిరి నుంచి హన్మపురం కి వెళ్తుంటే హన్మపురం గ్రామంలో మొబైల్ పడిపోయింది. భువనగిరి లోని అర్బన్ కాలనీలో ఉండే మహేష్ అనే అతని మొబైల్ అనంతరం కీ వెళ్లి వస్తుండగా దారి మధ్యలో పోయిందని భువనగిరి రూరల్ పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేయగా వీళ్ళ మొబైల్ వివరాలు సిఈఐఆర్ పోర్టల్ లో నమోదు చేసి ఐఎంఈఐ నెంబర్ల ఆధారంగా మొబైల్ ఆచూకీ కనిపెట్టి భాదితుడికి అతని మొబైల్ ని భువనగిరి రూరల్ పోలీసులు అప్పగించారు. ఫోన్ ఆచూకీ కోసం కృషి చేసిన భువనగిరి క్రైమ్ కానిస్టేబుల్ జి.చెన్నకేశవులును భువనగిరి రూరల్ ఎస్ఐ వి.సంతోష్ కుమార్ అభినందిచారు.

# నిరుపేద అంత్యక్రియలకు లయన్స్ చేయూత

కేసముద్రం ఆగస్టు 27 (రోమింగ్ న్యూస్): కేసముద్రం స్టేషన్ బ్రహ్మంగారితండాలో మృతి చెందిన నిరుపేద ఓర్సు మల్లయ్య(70) అంత్యక్రియలకు కేసముద్రం లయన్స్ క్లబ్ సహకారాన్ని అందించింది.సోమవారం రాత్రి మృతిచెందిన మల్లయ్యకు సొంత ఇల్లు లేకపోవడంతో ఆయన మృతదేహాన్ని స్థానిక బస్టాండ్ ఆవరణలోకి తీసుకువచ్చారు. ఆయన బంధువులు వచ్చేంత వరకు మృతదేహాన్ని భద్రపర్చేందుకు ఇబ్బందులు పడుతుండగా ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక లయన్స్ క్లబ్ సభ్యులు బాడీ ఫ్రీజర్ ను ఉచితంగా ఏర్పాటు చేశారు. అలాగే మంగళవారం జరిగిన అంత్యక్రియలకు వైకుంఠ రథాన్ని కూడా ఉచితంగా అందించారు. సుమారు రూ.4వేల విలువైన బాడీ ఫ్రీజర్, వైకుంఠ రథం సేవను ఉచితంగా అందించినట్లు క్లబ్ నిర్వాహకులు తెలిపారు. అలాగే తండావాసులు విరాళాలు అందజేయడంతో బంధువులు ఆయన అంత్యక్రియలను పూర్తి చేశారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
28 ఆగస్టు
2024





# వచ్చే నెలలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశం

## పన్ను రేట్లలో హేతుబద్ధీకరణ ఉండదన్న నిర్మలమ్మ

న్యూఢిల్లీ,ఆగస్ట్ 27 : వచ్చే నెల జరగబోయే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పన్ను రేట్ల హేతుబద్ధీకరణపై చర్చ ఉండబోతోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అయితే, పన్నులు, శ్లాబుల్లో మార్పులపై తుది నిర్ణయం తర్వాత తీసుకోనున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 9న 54వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరగనుంది. విలాసవంత వస్తువులు, హానికారక ఉత్పత్తులపై పరిహార సెస్ అంశంపైనా ఇదే సమావేశంలో చర్చించనున్నట్లు విలేకరులతో అన్నారు. బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి నేతృత్వంలో జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణపై ఏర్పాటైన మంత్రుల బృందం మొదటి సమావేశం ఇటీవల జరిగింది. ఆ భేటీలో పన్ను శ్లాబుల్లో ఎటువంటి మార్పులు చేయొద్దని కొందరు సభ్యులు సూచించారు. దీంతో ప్రస్తుతానికి 5, 12, 18, 28 ట్యాక్స్ శ్లాబులు కొనసాగుతాయని, దీనిపై మరింత చర్చించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కొన్ని వస్తువులపై రేట్ల మార్పిడి వల్ల కలిగే ప్రభావాన్ని మదింపు చేయడానికి ట్యాక్స్ ఆఫీసర్లతో కూడిన ఫిట్‌మెంట్ కమిటీకి అప్పగించినట్లు చౌదరి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశం గురించి సీతారామన్ మాట్లాడారు. రేట్ల హేతుబద్ధీకరణపై చర్చించనున్నామని, కమిటీ ఆఫీసర్లు దీనిపై ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. తదుపరి సమావేశాల్లో దీనిపై నిర్ణయం వెలువడనుందని చెప్పారు. పరిహార సెస్సును కొనసాగించాలని కర్ణాటక నుంచి డిమాండ్ వచ్చింది. పరిహార సెస్‌ను కొనసాగించే అంశంపైనా ఈ సమావేశంలో చర్చించనున్నట్లు సీతారామన్ తెలిపారు.

# స్థిరాస్తి వ్యాపారులు, నిర్వాసితులకు మధ్య వివాదం

## పరస్పరం రాళ్ల దాడితో ఉద్రిక్తత

ఖమ్మం,ఆగస్ట్ 27 : ఖమ్మం జిల్లా కేంద్రంలోని లింగయ్య నగర్‌లో ఉద్రిక్తత నెలకొంది. కొంతకాలంగా స్థిరాస్తి వ్యాపారులు, నిర్వాసితులకు మధ్య వివాదం కొనసాగుతోంది. మంగళవారం జేసీబీలతో గుడిసెలు తొలగించేందుకు స్థిరాస్తి వ్యాపారుల అనుచరులు యత్నించారు. వారిని నిర్వాసితులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాలు రాళ్లు రువ్వుకున్నారు. రాళ్లదాడిలో పలువురికి గాయాలయ్యాయి. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని అదుపు చేశారు. ఐదేళ్లుగా స్థానికంగా ఉంటున్నామని భూదాన్ నిర్వాసితులు చెబుతున్నారు.

# ఎంప్లాయ్ ఆఫ్ ది మంత్' భద్రత అవార్డులు

### 11 మంది రైల్వే ఉద్యోగులకు ప్రదానం

### దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ అందచేత

### జోన్‌లో రైలు కార్యకలాపాల భద్రతనిర్వహణపై సమీక్ష

హైదరాబాద్,ఆగస్ట్ 27 : దక్షిణ మధ్య రైల్వేలోని వివిధ డివిజన్ లలోని సిబ్బంది తమ విధి నిర్వహణలో చురుకుదనం,అంకితభావాన్ని ప్రదర్శించినందుకుగాను 11మంది ఉద్యోగులకు 'ఎంప్లాయ్ ఆఫ్ ది మంత్' భద్రతా అవార్డులను సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో మంగళవారం అందచేశారు. భద్రతా సమీక్షా సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ వీటిని అందజేశారు. ఈ సమీక్షా సమావేశంలో దక్షిణ మధ్య రైల్వేకు చెందిన వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులు, ఆరు డివిజన్లు సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్కు చెందిన డివిజనల్ రైల్వే మేనేజర్‌లు (డీఆర్‌ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. అరుణ్ కుమార్ జైన్ జోన్ పరిధిలోని వివిధ డివిజన్ లకు చెందిన 11మంది ఉద్యోగులకు విధి నిర్వహణలో అప్రమత్తతను ప్రదర్శించినందుకు అసురక్షిత పరిస్థితులను నివారించడానికి సకాలంలో చర్యలు చేపట్టినందుకు : సికింద్రాబాద్ డివిజన్ -02 ,హైదరాబాద్ డివిజన్ -01, విజయవాడ డివిజన్ -03, గుంతకల్లు డివిజన్ -04 మరియు గుంటూరు డివిజన్ -01 'ఎంప్లాయ్ ఆఫ్ ద మంత్' భద్రతా అవార్డులను అందజేశారు. ఈ అవార్డు గ్రహీతలలో లోకో పైలట్లు, స్టేషన్ మాస్టర్లు, టెక్నీషియన్లు, పాయింట్స్ మ్యాన్, మరియు ట్రాక్ మెయింటెయినర్లు మొదలైన వివిధ వర్గాలకు చెందినవారు ఉన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ అవార్డు గ్రహీతలవిధుల నిర్వహణలో వారి చిత్తశుద్ధి మరియు నిబద్ధతకు అభినందించారు. ఈ అవార్డులు భద్రతా విధానాలను అనుసరించడంలో ఇతర ఉద్యోగులను ప్రేరేపిస్తాయని, అలాగే రైళ్లను సురక్షితంగా నడిపేందుకు రైల్వేలకు కుడా ఎంతో సహాయపడతాయని ఆయన పేర్కొన్నారు. రువాత, ఆర్.ఎల్.డి.ఏ (రైల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ) అధికారులు దక్షిణ మధ్య రైల్వేకి సంబంధించి తాము అమలు చేస్తున్న వివిధ రైలు అభివృద్ధి ప్రాజెక్టుల స్థితిగతులపై వివరణాత్మక ప్రదర్శనను అందించారు. విజయవాడమరియు గుంటూరు డివిజన్‌ల డివిజనల్ రైల్వే మేనేజర్‌లు తమ జోన్‌లు చేపట్టిన ఆవిష్కరణలు/పనితీరుపై జనరల్ మేనేజర్ కు వివరించారు. వారి పనితీరుపట్టల జనరల్ మేనేజర్ డివిజన్లను అభినందించారు మరియు అదే కృషిని మున్ముందు కొనసాగించాలని సూచించారు

# బండి సంజయ్‌ది రాజకీయ అజ్ఞానం

### కవితకు బెయిల్‌పై వ్యాఖ్యలు దుర్మార్గం.. మండిపడ్డ మాజీమంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్ 27 : మద్యం పాలసీలో ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ కక్ష్యతో దర్యాప్తు సంస్థలు పెట్టిన కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితకు అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం పట్ల మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఒక ప్రకటనలో హర్షం ప్రకటించారు. ఆధారాల్లేని కేసులో ఐదు నెలలు జైలులో ఉంచడం బాధాకరమని, సుప్రీం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేయడాన్ని రెండు రాజకీయ పార్టీల ఒప్పందంగా పేర్కొనడం కేంద్ర మంత్రి స్థాయిలో ఉన్న బండి సంజయ్ రాజకీయ అజ్ఞానానికి నిదర్శనం అన్నారు. ఈ వ్యాఖ్యలు కోర్టు ధిక్కరణ కిందకే వస్తాయని అన్నారు. కవిత కేసులో న్యాయవాది వృత్తిపరంగా వ్యవహరించారన్న విషయం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు బయటపడి, తెలంగాణ కాంగ్రెస్ నేతలకు దానితో సంబంధం ఉందని తెలుస్తున్నా కోట్ల రూపాయలు అక్రమంగా అనుమానాస్పద ఖాతాల్లోకి మళ్లాయనే ఆరోపణలు వస్తున్నాయి. అయినా ఇప్పటి వరకు ఈడీ చర్యలు తీసుకోక పోవడంతోనే ఏ పార్టీ ఏ పార్టీతో కలిసి పనిచేస్తుందో అర్థమవుతున్నదని విమర్శించారు.

# పాతకారు తుక్కుగా ఇస్తే..కొత్తకారులో డిస్కౌంట్

## కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆఫర్

న్యూఢిల్లీ,ఆగస్ట్ 27 : కొత్త కారు కొనే వారికి కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. పాత వాహనాల్ని తుక్కు కింద సమర్పించి వాలిడ్ డిపాజిట్ సర్టిఫికెట్ చూపిస్తే కొత్త కారు కొనుగోలుపై డిస్కౌంట్ ఆఫర్ ను కల్పించింది. కమర్షియల్ లేదా ప్యాసెంజర్ వాహనాల తయారీ కంపెనీలు కొత్త వాహనాల కొనుగోలుపై డిస్కౌంట్ కల్పించేందుకు అంగీకరించిందని ఈ మేరకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. స్క్రాప్ కంపెనీలు ఈ డిస్కౌంట్ కు ఒకే చెప్పాయన్నారు. అంటే పాత వాహనం స్క్రాప్ కు ఇచ్చినట్టు సర్టిఫికెట్ చూపిస్తే కొత్తగా కొనుగోలు చేసే వాహనాలపై డిస్కౌంట్ పొందవచ్చు. తమ పాత వాహనాలను స్క్రాప్ చేసి కొత్త వెహికల్ కొనుగోలు చేసే వారికి దాదాపు 1.5 శాతం నుంచి 3.5 శాతం డిస్కౌంట్ ఇచ్చే అవకాశం ఉంది. ఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (సియామ్) సీఈవోలతో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

# ప్రశాంతంగా గణేశ్ ఉత్సవాల నిర్వహణ

### మట్టి విగ్రహాలనే వినియోగించాలి

### సన్నాహక సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు




హైదరాబాద్,ఆగస్ట్ 27 : గణేశ్ ఉత్సవాల నిర్వహణ విషయంలో అందరి సహకారంతో ముందుకెళ్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రజలు సంయమనంతో ఉత్సవాలు నిర్వహించు కోవాలన్నారు. గణేశ్ ఉత్సవాలకు హైదరాబాద్ అతిపెద్ద వేదికగా ఉంటోందని అన్నారు. అన్నిశాఖల అధికారులతో గణేష్ ఉత్సవాల సందర్భంగా ఏర్పాట్లపై హైదరాబాద్‌లో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఉత్సవాల్లో గణేశ్ నిమజ్జనం చాలా ముఖ్యమైంది. కుల మతాలకు అతీతంగా గణేష్ ఉత్సవాలు జరుపుకొంటున్నాం. ఎక్కడ ఏ చిన్న ఇబ్బంది జరగకుండా అన్ని శాఖల అధికారులను ఆదేశించాం. భక్తులకు, మండపం నిర్వాహకులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. మట్టి విగ్రహాలను పెద్ద ఎత్తున వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మట్టి విగ్రహాలు అందరికీ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. అందరికీ వివిధ మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. హుస్సేన్ సాగర్ విషయంలో సుప్రీంకోర్టు చేసిన ఆదేశాల అమలుకు ప్రజలందరి సహకారం అవసరం అని శ్రీధర్‌బాబు అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల గౌరవాన్ని పెంచే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో జరిగిన ఉత్సవాలను ప్రజల సహకారంతో ఏ విధంగా పూర్తి చేసుకున్నామో, అదే విధంగా ప్రశాంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఆర్టీసీ, మెట్రో సౌకర్యాలు మరింత పెంచుతామని, నిమజ్జనం వీలైనంత త్వరగా పూర్తి చేయాలని చూస్తున్నామని వివరించారు.

# టీచర్లు లేక పాఠశాలలు మూసివేత

### గిరిజన ప్రాంతాల్లో 43 స్కూళ్ల మూత

### సిగ్గు చేటని వ్యాఖ్యానించిన హరీష్ రావు

హైదరాబాద్,ఆగస్ట్ 27 : ఉపాధ్యాయులు లేక పాఠశాలలు మూతపడటమంటే పాలకులు సిగ్గుతో తలదించుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని హరీశ్ రావు అన్నారు. ముఖ్యంగా విద్యా, వైద్యం, తాగునీరు, రైతు రుణమాఫీ విషయాల్లో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు మూసివేశారని, తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ హరీశ్ రావు ఎక్స్(ట్విటర్) వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో నిర్మితమవుతుంది.. కానీ కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు తరగతి గదుల్లో చదువుకు నోచుకోని పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకటి కాదు రెండు కాదు 43 పాఠశాలలు.. అదీ గిరిజనులు అధికంగా నివసించే ప్రాంతంలో ఉపాధ్యాయులు లేక మూతపడటమంటే పాలకులు సిగ్గుతో తలదించుకోవాన్నారు. ప్రభుత్వ తప్పిదం వల్ల గిరిజనులు ప్రాథమిక విద్యకు దూరం కావడం క్షమించరాని నేరమని తెలిపారు. కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించింది ఉన్న స్కూళ్లను మూత వేయడానికా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని మూతపడ్డ 43 ప్రభుత్వ పాఠశాలలను వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. టీచర్ల నియామకం జరిగేవరకు విద్యా వాలంటీర్లను నియమించాలని విద్యాశాఖ మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు లేరన్న కారణంతో రాష్ట్రంలో ఏ ఒక్క పాఠశాల కూడా మూతపడకుండా చూడాలని, వెంటనే ముఖ్యమంత్రి స్థాయిలో విద్యాశాఖపై సమీక్ష నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపాలని ఎక్స్ వేదికగా కోరారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో నిర్మితమవుతుందని, కానీ కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు చదువుకు నోచుకోని పరిస్థితి దాపురించిందని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వ తప్పిదం వల్ల గిరిజనులు ప్రాథమిక విద్యకు దూరం కావడం క్షమించరాని నేరమంటూ ధ్వజమెత్తారు.

# బిఆర్ఎస్ పాపాల చిట్టాలో సిఎంఆర్ఎఫ్

### చికిత్సలు..రోగులు లేకుండానే నిధులు కాజేత

### తీగ లాగితే కదులుతున్న నేతల డొంక

హైదరాబాద్,ఆగస్ట్ 27 : గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన పాపాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. కొన్ని సమస్యలను బిఆర్ఎస్ నేతలు స్వయంగా తెలియ చేసి తమ పాపాలను తామే బయటపెట్టుకుంటున్నారు. కెటిఆర్, హరీష్ రావులు లేవనెత్తుతున్న సమస్యలన్నీ కొత్తగా వచ్చినవి కావు. వారు ప్రస్తావించే అంశాలన్నీ పదేళ్లుగా వారి పాలనలో ఉన్నవే. స్కూళ్లల్లో టీచర్ల కొరత, స్కూళ్లు మూసివేత, ఆస్పత్రులు ఇలా చెప్పుకుంటూ పోతే అన్నీ బిఆర్ఎస్ పాపాలకి ఉదాహరణలుగా చెప్పుకోవాలి. తాజాగా రాష్ట్రంలో వెలుగులోకి వచ్చిన ముఖ్యమంత్రి సహాయనిధి సిఎంఆర్ఎఫ్ స్కామ్ కూడా ఇందులో ఒకటి. తాజాగా ప్రభుత్వం దృష్టి పెట్టడంతో కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాకం బట్టబయలైంది. రోగులకు చికిత్స అందించకుండానే నకిలీ బిల్లులతో సిఎంఆర్ఎఫ్ నిధులు కొట్టేసి మోసాలకు పాల్పడ్డట్లు తాజాగా సిఐడి గుర్తించింది. ఈ మేరకు ప్రజల సొమ్మును లూటీ చేసిన ఆసుపత్రులపై కేసులు నమోదు చేసిం ది. హైదరాబాద్, ఖమ్మం, నల్గొండ, కరీం నగర్, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోని మొత్తం 28 ప్రైవేటు ఆసుపత్రులపై ఆరు కేసులను సిఐడి బుక్ చేసింది. గతేడాది ఏప్రిల్‌కు ముందు ఆసుపత్రులు ఈ దందాను నిర్వహించినట్లు ఎఫ్ఐఆర్‌లో సిఐడి వెల్లడించింది. నకిలీ బిల్లులతో ప్రైవేటు ఆసుపత్రులు ముఖ్యమంత్రి సహాయనిధి డబ్బులను దుర్వినియోగం చేస్తున్నాయనే ఆరోపణలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. ఇప్పుడు బయటపడుతున్న కుంభకోణాలపై కెటిఆర్, హరీష్ రావులు స్పందించడం లేదు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు, ఆసుపత్రి సిబ్బంది కలిసి నిధులు దోచేశారని తన ఎఫ్ఐఆర్‌లో తెలిపింది. దీనిపై సచివాలయ రెవెన్యూ మంత్రిత్వ శాఖ సెక్షన్ ఆఫీసర్ డిఎస్ఎన్ మూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందులో కొందరు రాజకీయ నాయకుల ప్రమేయం ఉన్నట్లు ఫిర్యాదులో పొందు పరిచారు. ఈ కుంభకోణంలో కొందరు బడా నాయ కులు సైతం ఉన్నట్లు తేలింది. దీనితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకున్నారు. విచారణను సిఐడికి బదలాయించారు. రంగంలో దిగిన సీఐడీ అధికారులు తమ దర్యాప్తును ఉధృతం చేశారు. పలు ఆసుపత్రులపై ఈ ఎఫ్ఐ ఆర్‌లు నమోదవ్వడంతో సిఎం సహాయ నిధి జాబితా నుంచి తొలగించారు. ఇదిలా ఉండగా, ఈ కేసులో గతంలోనే మాజీ మంత్రి, ప్రస్తుత బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీశ్ రావు వద్ద ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేసే వ్యక్తిపై సైతం కేసు నమోదైంది. కరుణ శ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, ఐఎస్ సదన్ ఎక్స్ రోడ్, శ్రీ కృష్ణ హాస్పిటల్, సైదాబాద్, జనని హాస్పిటల్, సైదాబాద్, హిరణ్యా హాస్పిటల్, మీర్‌పేట్, డెల్టా హాస్పిటల్, హస్తినాపురం, శ్రీ రక్షా హాస్పిటల్, బిఎన్ రెడ్డి నగర్, ఎంఎంఎస్ హాస్పిటల్, సాగర్ రింగ్ రోడ్, ఎడిఆర్ఎం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, శారదానగర్,ఎంఎంవి ఇందిరా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, కొత్తపేట, శ్రీ సాయి తిరుమల హాస్పిటల్, బైరామల్ గూడ. ఖమ్మంలో : శ్రీ శ్రీకర మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, గ్లోబల్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, డా. జె.ఆర్.ప్రసాద్ హాస్పిటల్, శ్రీ వినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీ సాయి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, వైష్ణవి హాస్పిటల్, సుజాత హాస్పిటల్, న్యూ అమృత హాస్పిటల్, ఆరెంజ్ హాస్పిటల్, మెగశ్రీ హాస్పిటల్, బోనకల్. నల్గొండలో : నవీనా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మిర్యాలగూడ, మహేష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మిర్యాలగూడ, అమ్మ హాస్పిటల్, రైల్వే స్టేషన్ రోడ్. కరీంనగర్‌లో : సప్తగిరి ఆసుపత్రి, జమ్మికుంట, శ్రీ సాయి ఆసుపత్రి, పెద్దపల్లి. వరంగల్ లో : రోహిణి మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్., హనుమకొండ. మహబూబాబాద్‌లో: శ్రీ సంజీవిని హాస్పిటల్, సిద్దార్థ హాస్పిటల్. వివరాలు వెల్లడయ్యాయి. వీటి వెనక బిఆర్ఎస్ నేతల ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది.

# కవితకు చట్టప్రకారమే బెయిల్ మంజూరు

## సుప్రీం తీర్పును స్వాగతించిన బిఆర్ఎస్ నేతలు

హైదరాబాద్,ఆగస్టు 27 : భారాస ఎమ్మెల్సీ కవితకు బెయిల్ ఇచ్చి సుప్రీంకోర్టు న్యాయం పక్షాన నిలిచిందని ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. కవితకు బెయిల్ ఇవ్వడాన్ని తాము స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఆమెకు బెయిల్ రావడం భారాసతోపాటు తెలంగాణ వాదులకు ఊరటనిచ్చే వార్త అన్నారు. మద్యం విధానంలో అక్రమంగా పెట్టిన కేసు అని, ఇందులో ఎలాంటి నిజాలు లేవని మొదట్నుంచి తాము చెబుతున్నామన్నారు. కవితకు బెయిల్ భారాస సాధించిన నైతిక విజయమని చెప్పారు. 'కవిత పోరాటయోధురాలు. ఇవాళ బెయిల్ వచ్చింది. త్వరలో కేసు నుంచి కడిగిన ముత్యంలా బయట పడతారు. ఆమె బెయిల్ పిటిషన్ సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ఈడీ, సీబీఐకి చెంప పెట్టులాంటివి. దర్యాప్తు సంస్థల కక్ష సాధింపు చర్యలను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పు పట్టింది. పాలకపక్షం రాజకీయ ప్రత్యర్థులను వేధిస్తున్న ఈడీ, సీబీఐ తీరుపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలని ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. ఇదిలావుంటే ఆలస్యం అయినప్పటికీ ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడం సంతోషకర విషయమని మాజీ ఎంపీ, భారాస నేత వినోద్ కుమార్ అన్నారు. భాజపా వ్యతిరేక రాజకీయ నేతలపై ఆరోపణలు లేకపోయి ఉంటే దిల్లీ మద్యం కేసులో 15 రోజుల్లోనే బెయిల్ వచ్చేదని చెప్పారు. బతుకమ్మ పండుగ, తెలంగాణ సంస్కృతిని కవిత ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పారని తెలిపారు. మోదీ నేతృత్వంలోని భాజపా ప్రభుత్వం కొందరిపై మొదట కేసులు పెట్టి ఆ తర్వాత వారిని లొంగదీసుకున్నారు. మేము లొంగి ఉంటే కవిత ఎప్పుడో బయటకు వచ్చేవారు. మేం గట్టిగా నిలబడి కొట్లాడి చట్ట ప్రకారమే బెయిల్ తెచ్చుకున్నాం. ఇది కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టడానికి చేసిన కుట్రగా తెలంగాణ ప్రజలు భావిస్తున్నారు. మండు వేసవిలో కవిత జైలు జీవితాన్ని అనుభవించారు. ఈ కేసులో ఒక్క రూపాయి కూడా రికవరీ చేయలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఛార్జ్ షీట్ వేశాక ఇంకా జైల్లో ఎందుకు పెట్టారని సుప్రీంకోర్టు న్యాయమూర్తి ప్రశ్నిస్తే సమాధానం లేదు. ఆదేశాలు తీసుకుంటానని ఈడీ న్యాయవాది అన్నారు.. అమిత్ షా అనుమతి తీసుకుంటారా? కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ అనాలోచితంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని వినోద్‌కుమార్ చెప్పారు.

# బిజెపిలో బిఆర్ఎస్ విలీనం ఖాయం

## టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్,ఆగస్టు 27 : బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవితకు బెయిల్ ఊహించిందేనని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంఎల్‌సి మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. బిజెపి, బిఆర్ఎస్ పై విమర్శలు చేసి తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియాలో వీడియోను మహేష్ కూమార్ గౌడ్ పోస్టు చేశారు. బిజెపి, బిఆర్ఎస్ కుమ్మక్కుతోనే కవితకు బెయిల్ వచ్చిందన్నారు. మొన్నటి వరకు చీకటి ఒప్పందాలతో కాంగ్రెస్ ను దెబ్బతీయాలని రెండు పార్టీలు చూశాయని ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి బిఆర్ఎస్ పరోక్షంగా మద్దతు ఇచ్చిందని, బిజెపికి బిఆర్ఎస్ దాసోహంగా మారిందని మహేశ్ కుమార్ ఆరోపణలు చేశారు. హరీష్, కెటిఆర్ లు ఢిల్లీలో బిజెపి నేతల చుట్టూ ఆపద మొక్కులు మొక్కారని ఎద్దేవా చేశారు. బిజెపి నేతల ఇళ్ల చుట్టూ తిరిగి వాళ్ల కాళ్ళ మీద పడి కవితకు బెయిల్ తెచ్చుకున్నారని విమర్శలు గుప్పించారు. ఇదే విషయాన్ని తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలని, బిజెపి, బిఆర్ఎస్ లు కుమ్మక్కు రాజకీయాలు బయటపడ్డాయని మహేశ్ కుమార్ ధ్వజమెత్తారు. బిజెపిలో బిఆర్ఎస్ విలీన పక్రియ మొదలు అవుతుందని, ఇంకా విలీనం ఒక్కటే మిగిలిందని చురకలంటించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం 28 ఆగస్టు 2024





# కాళేశ్వరం అవినీతిపై కొనసాగుతున్న విచారణ

## రాఫ్ట్ కింద పలు సమస్యల వల్లనే కుంగుబాటు

## పొంతనలేని సమాధానాలపై కమిషన్ ఆగ్రహం



హైదరాబాద్,ఆగస్టు 27 : కాళేశ్వరం లిఫ్టుల్లో అవినీతి, అక్రమాలు, నాణ్యతా లోపాలపై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు జస్టిస్ పీసీ చంద్రఘోష్ కమిషన్ విచారణ కొనసాగుతోంది. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగు బాటుకు కారణం రాఫ్ట్ కింద పలు సమస్యల వల్ల జరిగింది అన్నట్లు మిషన్ ముందు ఇంజనీర్లు చెప్పారు. సిఖెండ్ ÷ల్స్, అలాట్మెంట్ డివియేషన్ వల్ల సమస్య వచ్చింది అన్నట్లు ఇంజనీర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. డిజైన్ల అప్రూవల్ తర్వాత అన్నారం గ్యారేజీ మోడిఫికేషన్ జరిగిందని కమిషన్ ముందు ఇంజనీర్ ఒప్పుకున్నారు. అయితే రామగుండం ఈసీ లేఖపై మాత్రం కమిషన్ ముందు ఇంజనీర్ దయాకర్ రెడ్డి స్పష్టత లేని సమాధానం చెప్పినట్లు తెలుస్తోంది. హై పవర్ కమిటీలో సీడీఓ అధికారులు సభ్యులుగా ఉన్నారు అని ఇంజనీర్లు ఒప్పుకున్నారు. డిజైన్లు తయారు చేసే ముందు సైట్ విజిట్ ఖచ్చితంగా చేయన క్కర్లేదు అని కమిషన్ ముందు వారు చెప్పారు. అన్నారం సుందిళ్ల బ్యారేజీల లొకేషన్ మారినట్లు కమిషన్‌కు అధికారులు చెప్పారు. అయితే మేడిగడ్డ లొకేషన్ మారలేదని తాజా మాజీ ఇంజనీర్లు.. కమిషన్ ముందు స్పష్టం చేశారు. సీడీఓ - ఎల్అండ్‌టీ వేర-వేరుగా డిజైన్లు తయారుచేసి ÷నైల్ అప్రూవల్‌కు అన్ని ఒకే దగ్గర చేసినట్లు ఇంజనీర్లు తెలిపారు. మూడు బ్యారేజీలకు సంబంధించి డిజైన్లలో ఎలాంటి సమస్య లేదని నిబంధనల ప్రకారమే డిజైన్లు ఉన్నాయని ఇంజనీర్లు వెల్లడించారు. ఇలా పొంతనలేని సమాధానాలపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంజనీర్లపై జస్టిస్ పీసీ చంద్ర ఘోష్ కమిషన్ సీరియస్ అయ్యింది. పొంతనలేని సమాధానాలు చెప్పడంపై ఇంజనీర్ల తీరును తప్పుబట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఓపెన్ కోర్టులో భాగంగా మంగళవారం విచారణకు ఐదుగురు తాజా, మాజీ అఆక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు హాజరయ్యారు. విచారణలో భాగంగా అప్రూవల్ పొందిన తర్వాత బ్యారేజీల డిజైన్లలో మార్పులు చేర్పులు ఏమైనా జరిగాయా అని కమిషన్ ప్రశ్నించింది. డిజైన్లు అప్రూవల్ చేసే ముందు ఆ తర్వాత అన్ని నిబంధనలు పాటించారా అని ప్రశ్నించారు పీసీ ఘోష్. హై పవర్ కమిటీ నిబంధనలు క్రైటీరియా ఫాలో అయ్యారా లేదా అని ఇంజనీర్లను ప్రశ్నించారు. డిజైన్స్ అప్రూవల్ అయిన తర్వాత లొకేషన్ లలో ఏమైనా మార్పులు చేర్పులు చేశారని ప్రశ్నించారు. అన్నారం సుందిళ్ల బ్యారేజీల లొకేషన్ మారినట్లు కమిషన్ కు చెప్పారు అధికారులు. మేడిగడ్డ లోకేషన్ మారలేదని కమిషన్ ముందు స్పష్టం చేశారు తాజా మాజీ ఇంజనీర్లు. సిడిఓ - ఎల్ అండ్ టి వేరువేరుగా డిజైన్లు తయారుచేసి ఫైనల్ అప్రూవల్ కు అన్ని ఒకే దగ్గర చేసినట్లు తెలిపారు. మూడు బ్యారేజీలకు సంబంధించి డిజైన్లలో ఎలాంటి సమస్య లేదని నిబంధనల ప్రకారమే డిజైన్లు ఉన్నాయని ఇంజనీర్లు తెలిపారు. అయితే కమిషన్ అడిగే ప్రశ్నలకే ఎదురు ప్రశ్నలు వేయడంతో పాటు అడిగిన ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు ఇచ్చారు అఆక్ష మాజీ ఇంజనీర్లు. దీంతో కమిషన్ ఇంజనీర్లపై ఆగ్రహం వ్యక్తం చేసింది. మధ్యాహ్నం వరకు ఇద్దరి ఇంజనీర్ల విచారణ ముగిసింది. కాసేపట్లో మరో ముగ్గురు ఇంజనీర్లను కమిషన్ విచారించనుంది. మరోవైపు మాజీ జల వనరుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మెన్ వి ప్రకాష్ బీఆర్‌కే భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 37 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందన్నారు. రఘు, వేధిర్ శ్రీరామ్ సీడబ్ల్యూసీ అంశాలను వక్రీకరించారని తెలిపారు. తాను కమిషన్ ముందు అఫిడవిట్ దాఖలు చేశానన్నారు. తుమ్మిడిహట్టి నిర్మాణం సాధ్యం కాదు అని వివరాలు ఇచ్చినట్లు తెలిపారు. తుమ్మడిహెట్టిపై కాగ్ ఆక్షేపాలను కమిషన్‌కు తెలియజేసినట్లు చెప్పారు. అఫిడవిట్ పరిశీలన తరువాత మళ్ళీ పిలుస్తామని కమిషన్ అన్నదన్నారు. నిజమైన దోషులకు శిక్ష పడాలి అనేదే తమ ఉద్దేశమని వి.ప్రకాష్ పేర్కొన్నారు.

# అందరికీ రుణమాఫీ జరిగితీరుతుంది

## రైతులకు మరోమారు భరోసా ఇచ్చిన మంత్రి తుమ్మల

ఖమ్మం,ఆగస్టు 27 : రుణమాఫీ కాని రైతులు అధైర్య పడవద్దని, అందరికీ మాఫీ చేసే బాధ్యత ప్రభుత్వానిదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మరోమారు స్పష్టం చేశారు. రైతు రుణమాఫీపై కలెక్టరేట్ వద్ద రైతు సంఘాలు మంగళవారం ధర్నాకు దిగాయి. విషయం తెలిసిన వెంటనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అక్కడకు చేరుకున్నారు. ధర్నా వద్దకు వెళ్లి రైతు సంఘం నేతలకు రైతులకు రుణమాఫీపై స్పష్టతనిచ్చారు. ఆపై రైతులు తమ ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రైతు రుణమాఫీ అవ్వని రైతులు అపోహ పడొద్దన్నారు. కుటుంబ నిర్ధారణ కానీ రైతుల ఇళ్లకు వ్యవసాయ శాఖ సిబ్బంది వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. రైతుల ఇంటి వద్దే కుటుంబ నిర్ధారణ చేసి వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తారన్నారు. బ్యాంకుల్లో మొత్తం 42 లక్షల రైతులు 31 వేల కోట్లు అప్పు ఉన్నారని తెలిపారు. రెండు లక్షల రుణమాఫీ 18 వేల కోట్ల రైతులు ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడించారు. రెండు లక్షల పైన రుణాలు ఉన్న రైతుల రుణమాఫీపై క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామ న్నారు. గత ప్రభుత్వం చేసిన రైతు రుణమాఫీపై కాగ్ నివేదికలో వాస్తవాలు వెల్లడయ్యాయన్నారు. రైతులను గందరగోళం చేసే పనులు చేయొద్దని హితవుపలికారు. సీఎం రేవంత్ రెడ్డి వాగ్దానం చేసినట్లు 31 వేల కోట్లు రుణమాఫీ చేసి తీరుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి స్పష్టం చేశారు.

# కవితకు బెయిల్‌పై బండి విపరీత వ్యాఖ్యలు

## కోర్టు ధిక్రణగా పరిగణించాలన్న కెటిఆర్

హైదరాబాద్,ఆగస్టు 27 : ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయటంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. సుప్రీంకోర్టుకు ఉద్దేశాలు ఆపాదించేలా కామెంట్స్ చేసిన బండి సంజయ్ తీరును తప్పుబట్టారు. ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బె యిల్ మంజూరు చేయడం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలా విజయమంటూ బండి సంజయ్ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ లాయర్ చేసిన కృషితో ఒకరికి బెయిల్ వస్తే బీఆర్ఎస్ సపోర్ట్ కారణంగా ఒకరు రాజ్యసభలో స్థానం పొందారంటూ వివాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్సీ కవిత బెయిల్ కోసం తొలుత వాదనలు వినిపించిన లాయర్‌కు కాంగ్రెస్ తరఫున రాజ్యసభ సీటు వచ్చేలా కేసీఆర్ రాజకీయ చతురత ప్రదర్శించారంటూ ఆయన చేసిన ట్వీట్ చేశారు. వైన్ అండ్ డైన్ క్రైమ్ లో పార్టనర్స్ అయిన కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు కంగ్రాట్యులేషన్స్ అంటూ స్థాయిని మరిచి సుప్రీంకోర్టు తీర్పును అపహాస్యం చేసేలా బండి సంజయ్ కామెంట్స్ చేశారు. దీనిపై కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. కేంద్ర హోంశాఖ సహాయశాఖ మంత్రిగా ఉన్న బండి సుప్రీంకోర్టు తీర్పుపై అభ్యంతరం వ్యక్తం చేయడం సరికాదని తెలిపారు. గౌరవప్రదమైన స్థానంలో ఉండి ఇలా స్పందించడమేంటని నిలదీశారు. ఈ వ్యాఖ్యలను కోర్టు ధిక్కారంగా తీసుకుని బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఓవైసీ బ్రదర్స్‌కు బెదరవద్దు

## అక్రమాల కూల్చవేత కొనసాగించాలి

## రేవంత్‌కు పూర్తి మద్దతు తెలిపిన ఎమ్మెల్యే రాజాసింగ్

హైదరాబాద్,ఆగస్టు 27 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మద్దతు తెలిపారు. చెరువులను కాపాడాలని సీఎం సంకల్పం తీసుకోవటం అభినందనీయమని కొని యాడారు. సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం పూర్తి కావాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఓవైసీ బ్రదర్స్ బెదిరింపులకు భయపడొద్దని ఎమ్మెల్యే తెలిపారు. వేలమంది యువత మద్దతు ఉందని అక్బరుద్దీన్ బెదిరిస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి మాదిరి భయపడకుండా రేవంత్ రెడ్డి ముందుకెళ్ళాలని సూచించారు. ఓవైసీ బ్రదర్స్‌ను బొక్కలో వేసిన సీఎంగా కిరణ్ కుమార్ రెడ్డికి పేరుందని గుర్తుచేశారు. ఉచిత విద్య పేరుతో ఓవైసీ సోదరులు కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. చెరువులో 12ఎకరాలు ఆక్రమించి ఫాతిమా కాలేజ్‌ను నిర్మించారన్నారు. అసదుద్దీన్ ఓవైసీ బంగ్లా కూడా ప్రభుత్వ స్థలంలోనే ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంఐఎంకు గులాంగిరి చేసిందని విమర్శించారు. కలెక్టర్ సాయంతో గోషామహల్ నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు మాయమవుతున్నాయని రాజాసింగ్ పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తూ హైడ్రా ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే హైడ్రాపై మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. బండ్లగూడ లో గల ఫాతిమా ఓవైసీ కాలేజీని హైడ్రా కూల్చివేస్తుందనే వార్తలపై స్పందించారు. చెరువు కబ్జా చేసి ఓవైసీ బ్రదర్స్ స్కూల్ నిర్మించారని హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయి. ఆ క్రమంలో అక్బరుద్దీన్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'కావాలంటే నాపై మళ్లీ బు÷-లలెట్ల వర్షం కురిపించండి. ఆ స్కూల్ కూల్చకండి. పేదలకు ఉచిత విద్య అందించేందుకు 12 బిల్డింగులు నిర్మించా. వీటిని కావాలని కొందరు తప్పుగా చూపిస్తున్నారు. గతంలో నాపై కాల్పులు జరిగాయి. కావాలంటే మళ్లీ బు÷-లలెట్ల వర్షం కురిపించండి. కత్తులతో దాడి చేయండి. పేదల విద్యాభివృద్ధి కృషికి అడ్డుపడకండి అని' అక్బరుద్దీన్ సూచించారు. అయితే ఇప్పుడు ఎమ్మెల్యే అక్బరుద్దీన్ వ్యాఖ్యలతో సల్కం చెరువు కబ్జా విషయం హాట్ టాపిక్ గా మారింది. ఎవరి నోట విన్నా ఇదే చర్చ నడుస్తోంది. రేవంత్ రెడ్డి సర్కార్.. ఒవైసీ బ్రదర్స్‌కు చెందిన విద్యాసంస్థలను కూల్చుతుందా? లేదా? అనేది సస్పెన్స్‌ను తలపిస్తోంది. ఓవైసీ బ్రదర్స్ నిర్మించిన అక్రమ నిర్మాణాలు కూల్చాలంటూ హైడ్రాకు ఫిర్యాదుల మీద ఫిర్యాదులు అందుతున్నాయి. చెరువును మట్టితో పూడ్చేసి భారీ భవనాల నిర్మాణం గావించారు . 2016 - 2021 లో కబ్జాకు గురైనట్టు నిర్ధారణ అయ్యింది.

# చట్టబద్ధంగానే గెస్ట్‌హౌజ్ నిర్మాణం

## పట్నం మహేందర్ రెడ్డి వివరణ

హైదరాబాద్,ఆగస్ట్ 27 : ప్రభుత్వ నిబంధనల ప్రకారమే గెస్ట్ హౌస్ నిర్మించుకున్నానని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. హిమాయత్ సాగర్‌లో నిర్మించిన గెస్ట్ హౌస్‌పై ఆయన వివరణ ఇచ్చారు. చెరువులు ఆక్రమించి కట్టిన నిర్మాణాల కూల్చివేతను సమర్థిస్తున్నట్లు చెప్పారు.ఎలాంటి చెరువు భూమిని ఆక్రమించి ఇల్లు నిర్మించలేదు. నిబంధనల ప్రకారం లేదని తేలితే నేనే కూల్చివేస్తాను. 111 జీవో పరిధిలో చాలా మంది మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇళ్లు నిర్మించుకున్నారు. ప్రభుత్వం అనుమతిస్తేనే నిర్మించుకున్నాం. నా గెస్ట్ హౌస్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉంటే కూల్చేయమని చెప్తున్నా. పట్టాభూమిలోనే నా గెస్ట్ హౌస్ ఉంది. అక్కడికి దగ్గర్లోనే చాలా ఫంక్షన్ హాళ్లు ఉన్నాయి. పూర్తి వివరాలు తెలియకుండా కేటీఆర్ మాట్లాడారని భావిస్తున్నానని చెప్పారు.

# కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

హైదరాబాద్,ఆగస్ట్ 27 : కుటుంబ తగాదాలు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఓ వ్యక్తి క్షణికావేశంలో కుటుంబసభ్యులు చూస్తుండగానే ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మీర్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లెలగూడ లలితానగర్ కాలనీలో నివసించే శీలం సురేష్ (37) అబిడ్స్‌లోని జనరల్ పోస్టాఫీసులో వ్యాన్‌డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం దంపతుల మధ్య ఘర్షణ జరగగా, ఆవేశంలో బెడ్రూమ్‌లోకి వెళ్లిన సురేష్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. కుటుంబసభ్యులు కాపాడేలోపే మంటల్లో కాలిపోయాడు. గదిలోని ఫర్నిచర్‌కు మంటలు అంటుకొని దట్టమైన పొగ అలుముకుంది. సమాచారమందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలావుండగా వైద్య పరీక్షల నిమిత్తం కూతురిని వెంటబెట్టుకొని బైక్‌పై వెళ్తుండగా టెంపో ట్రావెల్ మినీ బస్సు మృత్యువు రూపంలో దూసుకొచ్చింది. ఈ ఘటనలో కూతురు దుర్మరణం పాలుకాగా, తండ్రికి గాయాలయ్యాయి. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగర శివారు చెంగిచెర్లకు చెందిన శంకరరావు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్పీఎఫ్)లో ఎస్ఐ. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొద్దిరోజులుగా తనకు అనారోగ్యంగా ఉండడంతో ఎర్రమంజిల్ ఏఐజీ ఆస్పత్రిలో ఎండోస్కోపీ పరీక్ష కోసం సోమవారం కూతురు ప్రసన్న(25)తో కలిసి బైక్‌పై బయలుదేరాడు. బేగంపేట మెట్రోస్టేషన్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన టెంపో ట్రావెల్ మినీ బస్సు వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో ప్రసన్న అక్కడికక్కడే మృతిచెందగా, శంకర్‌రావుకు గాయాలయ్యాయి. పోలీసులు టెంపో ట్రావెల్స్ డ్రైవర్ సతీశ్‌ను అరెస్టు చేశారు.

# కేసుల్లో జాప్యం..తీర్పుల అమలులో నిర్లక్ష్యం!

మన న్యాయవ్యవస్థ ఇంకా బ్రిటిష్ కాలంనాటి పరిస్థితులకు అనుగుణంగానే సాగుతోంది. న్యాయ వ్యవస్థతో పాటు చట్టాలు, శిక్షల్లో భారతీయాకరణ జరగాల్సి ఉంది. ఇటీవల మన ఐపిసి స్థానంలో కొత్త చట్టాలు ప్రవేశ పెట్టిన దరిమిలా దీనిపై చర్చ చేయాలి.ఎందుకంటే పెరుగుతున్న నేరాలు,కొత్తకొత్త మోసాలు, ఐటి,ఆన్‌లైన్ మోసాలు, అత్యాచారాలు వంటి వాటిని పరిశీలించి చట్టాలను మార్పు చేసుకోవాల్సి ఉంది. కోల్‌కతా ఆస్పత్రిలో డాక్టర్ హత్యాచారం తరవాత అనేక ఘటనలు మళ్లీ జరుగుతూనే ఉన్నాయి. అత్యాచారాలపై ప్రజల్లో భయం లేకుండా పోతున్నది. దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నా ఇంతవరకు అసలు దోషులను పట్టుకోలేదు. మన పోలీస్ వ్యవస్థ పక్కాగా లేదనడానికి ఇదే నిదర్శనం. ఇకపోతే లిక్కర్ కేసులో సత్వర విచారణ సాగడం లేదు. బెయిల్ రాకుండా నేతలను జైలుకు పంపిస్తున్నారు. అలాగే నేతల అవినీతి పైనా విచారణ సాగడం లేదు.సామాన్యులకు న్యాయం అందకుండా పోతోంది. నిరంతరం రాజకీయ కేసులు తప్ప సామాన్యుల పక్షాన న్యాయవ్యవస్థ బలంగా నిలబడడం లేదు. నేటికీ ఎందరో చేయని నేరాలకు జైళ్లలో మగ్గుతున్నారు. ఇలాంటి వారిని ఎలా బయటకు తీసకుని వస్తారన్నది కూడా ముఖ్యం. అలాగే ఎలాంటి కేసునైనా కనీసం 3నెలల్లో ముగించి తీర్పును ఇచ్చేలా కఠిన చట్టాలను అమలు చేయాలి. అంబేడ్కర్ మహాశయుడి ఆలోచనలకు అందని విధంగా మన రాజకీయాలు మారుతున్నాయి. రాజ్యాంగాన్ని తమ గుప్పిట్లో పెట్టుకుని నాయకులు రాజ్యమేలుతున్నారు. అవినీతికి పాల్పడ్డా పెద్దగా శిక్షలు పడడం లేదు. నెలరోజుల్లోగా ఎన్నికైన ప్రజాప్రతినిధులపై ఏవైనా కేసులు ఉంటే తేల్చేయాలి. ఏళ్లతరబడి కేసులను నాన్చేయడం వల్ల ఐదేళ్ల పుణ్యకాలం గడిచిపోతోంది. చిట్టచివరకు ఎన్నికల ముందు తీర్పులు వ్యతిరేకంగా వచ్చినా చేయగలిగేది ఏమీ లేదు. కనుక వీటిపైనా దృష్టి సారించాల్సి ఉంది. న్యాయవ్యవస్థ లో సమూల మార్పులు జరగాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా స్థానిక భాషల్లో కోర్టు కార్యకలాలపాలు సాగాలి. అప్పుడే ప్రజలకు కూడా ఏం జరుగుతుందో తెలుస్తుంది. కోర్టుల్లో న్యాయ చర్చలను స్థానిక భాషల్లో చర్చించేలా చట్టం చేసుకోవాలి. గతంలో ప్రధాని మోడీ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. కాబట్టి ఇప్పుడీ విషయంపై చర్చించాల్సిన అవసరం ఉంది. ప్రజలకు అర్థంకాని భాషలో కాకుండా ప్రజలకు అర్థం అయ్యే భాషలో న్యాయచర్చలు సాగాలి. కోర్టుతీర్పులు స్థానిక భాషల్లో విడుదల చేయాలి. పాలకులు పేదలకు న్యాయన్ని చేరువ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలి. అనేక సంస్కరణలు తీసుకుని వచ్చామని చెబుతున్న ప్రధాని మోడీ ఈ న్యాయవ్యవస్థలో ఉన్న లోటుపాట్లను గుర్తించి తక్షణ చర్యలకు పూనుకోవాలి. పార్లమెంట్ వేదికగా దీనికి శాశ్వత పరిష్కారం చూపాలి. ఇప్పటివరకు పనిచేసిన న్యాయమూర్తులు ఆయా సందర్భాల్లో తమ విలువైన సూచనలు చేశారు. వాటిని సలహాలుగా తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగాలి. ప్రజలకు ఏంచేస్తే సత్వర న్యాయం అందుతుందో ఆలోచించాలి. అవసరమైతే మాజీ ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తులతో కమిటీలు వేసి వారి సలహాలు తీసుకోవాలి. ప్రతిపేదవాడికి న్యాయం అందించడమే న్యాయమూర్తి ప్రధాన లక్ష్యం కావాలి. దేశంలో న్యాయం పట్ల జరుగుతున్న ఆలస్యాన్ని గుర్తించి సత్వర న్యాయం అందేందుకు అసవరమైన చర్యలను చేపట్టాలి. నిర్ణీత కాలంలోగా న్యాయ విచారణలు, తీర్పులు వచ్చేలా చట్టబద్ధం చేసుకోవాలి. ఇదే సందర్భంలో పెండింగ్ కేసులు సమస్యగా మారాయని కూడా గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలి. ప్రతి తీర్పులోనూ ప్రజలకు న్యాయం జరిగిందన్న భావన కలగించాలి. రాజకీయ నాయకుల కేసుల విషయంలో త్వరగా విచారణ జరిపి శిక్షలు వేస్తే మంచిది. కోర్టు తీర్పులను అమలు చేయని ప్రభుత్వాలపై కఠిన చర్యలకు అవకాశం ఉండాలి. ఇటీవల పలువురు సుప్రీం చీఫ్ జస్టిస్‌లుగా పనిచేసిన వారు న్యాయవ్యవస్థలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇవన్నీ కూడా పేదలకు సత్వర న్యాయం అందాలన్న తపనతో చేసినవే తప్ప మరోటి కాదు. భారత న్యాయ వ్యవస్థ సాధారణ ప్రజలకు ఎంతో దూరంలో నిలిచిందన్న ఆరోపణల్లో వాస్తవాలను గుర్తించాలి. ఇప్పటికీ కోట్ల మంది అణగారిన వర్గాల ప్రజలకు న్యాయ సహాయం అవసరం ఉంది. తమకు అన్యాయం జరిగిందని భావించిన ప్రతి వారూ కోర్టులకు వెళ్లడం లేదు. ఎందుకంటే కోర్టులకు వెళితే తేలేదేమీ లేకపోగా అనవసర కాలయాపన, డబ్బులు దండగ అన్న భావనలో ప్రజలు ఉన్నారు. అవసరమైన వెంటనే న్యాయ వ్యవస్థను ఆశ్రయించడానికి ఇంకా వారు జంకుతూనే ఉన్నారు. న్యాయవ్యవస్థ రాజ్యాంగబద్ధమైన విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ నిర్ణీత కాలవ్య వధిలో కోర్టుల్లో కేసులు తేలడంలేదు. తీర్పులు వచ్చాక అమలు కావడం లేదు. వివేకానందరెడ్డి హ్యతకేసు, కోడికత్తి కేసు, లిక్కర్ కేసు, జగన్ అవినీతి కేసులు ఇలా చెప్పుకుంటూ పోతే కోకొల్లలు. ఎంతలా జాప్యం జరుగుతుందో చూడవచ్చు. పోలీసుల విచారణలో జాప్యం.. కోర్టుల్లో జాప్యం వంటివన్నీ పోవాలి. కేసు తీవ్రతను బట్టి సత్వర విచారణ, తీర్పులు రావాలి. ఇందుకు అవసరమైతే.. మనదేశం వేల ఏళ్లుగా అనుసరించిన రాజ్యాంగ వ్యవస్థలను, న్యాయవ్యవస్థలను, ఇతర దేశాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలి. నిజానికి కోర్టులు, రాజ్యాంగం పట్ల ప్రజలకు సరైన అవగాహన లేదు. ప్రజలను కోర్టులకు చేరువ చేయడం రాజ్యాంగ విధి కావాలి. రాజ్యాంగం అంటే పాలకులకు సంబంధించిన వ్యవహారంగా ఉండరాదు. న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు, విశ్వాసం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రజలకు న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసం కలిగించాలి. స్థానికంగగా న్యాయస్థానాలను పెంచి సత్వర న్యాయం కలిగించాలి. మన న్యాయ వ్యవస్థ, ప్రొసీడింగ్స్ ఇంకా ఆంగ్లేయులనాటి విధానాలనే అవలంబిస్తోందన్న ఆరోపణల నుంచి బయటపడి పటిష్ట మైన న్యాయ చట్టాలను రూపొందిం చాలి. దీనిని ప్రాతిపదికగా తీసుకుని మన పాలకులు న్యాయ వ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. సత్వర న్యాం అందడం కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. కోల్‌కతా అత్యాచార కేసులో సత్వర విచారన పూర్తి చేసి దోషులను బహిరంగంగా ఉరితీస్తే తప్ప ప్రజల్లో మార్పు రాదు. మహిళలకు భద్రత దక్కదు.

# అవును ..బిజెపిలో చేరుతున్నా!

## జార్ఖండ్ మాజీ సిఎం చంపయ్ సోరెన్ వెల్లడి

రాంచీ,ఆగస్ట్ 27 : జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ నాయకుడు చంపాయ్ సోరెన్ సొంత పార్టీ పెడుతారా.. లేదంటే బీజేపీలో చేరుతారా..? అనే సందిగ్ధానికి తెరపడింది. తాను బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ నెల 30న బీజేపీలో చేరనున్నట్లు తెలిపారు. ఇదే విషయాన్ని జార్ఖండ్ బీజేపీ వ్యవహారాల ఇన్‌చార్జి, అసోం ముఖ్యమంత్రి హిమాంత బిశ్వశర్మ ముందుగానే ప్రకటించారు. చంపాయ్ సోరెన్ ఇప్పుడు స్వయంగా ధ్రువీకరించారు. ఈ నెల 18న నేను ఢిల్లీకి వచ్చినప్పుడే నా స్థానం ఏమిటో స్పష్టం చేశాను. వాస్తవానికి ముందుగా నేను రాజకీయాల నుంచి తప్పుకోవాలని భావించాను. కానీ ప్రజలలో నాకున్న మద్దతు చూసి నిర్ణయం మార్చుకున్నా. బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నా' అని చంపాయ్ సోరెన్ చెప్పారు. ఈ నెల 30న మీరు బీజేపీలో చేరతారని వార్తలు వినిపిస్తున్నాయి, వాస్తవమేనా అన్న మీడియా ప్రశ్నకు చంపాయ్ సోరెన్ అవునని సమాధానం ఇచ్చారు. కాగా, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ భూకుంభకోణం కేసులో అరెస్ట్ కావడంతో సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో సీనియర్ నాయకుడు చంపాయ్ సోరెన్‌ను సీఎంగా నియమించారు. అయితే గత నెలలో ఆ కేసులో హేమంత్ సోరెన్‌కు బెయిల్ లభించడంతో జైలు నుంచి విడుదలయ్యారు. అనంతరం చంపాయ్ సోరెన్‌తో రాజీనామా చేయించి సీఎం పదవి చేపట్టారు. దాంతో తన నుంచి అవమానకరంగా సీఎం పదవి లాక్కున్నారని చంపాయ్ సోరెన్ మనస్తాపం చెందారు. ఈ నేపథ్యంలో తదనంతర పరిణామాలు చోటుచేసుకున్నాయి.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం 28 ఆగస్టు 2024



# నేటి నుంచి పారాలింపిక్స్




## భారత్ నుంచి 84 మంది బరిలోకి..

పారిస్: వందేళ్ల తర్వాత వినూత్నరీతిలో సమ్మర్ ఒలింపిక్స్‌ను నిర్వహించిన పారిస్ నగరంలో మరో క్రీడా సందడి. బుధవారం నుంచి సెప్టెంబరు 8 వరకు ఈ ఫ్యాషన్ నగరిలో పారాలింపిక్స్ సందడి నెలకొనబోతోంది. 22 క్రీడాంశాలు, 549 విభాగాల్లో 180 దేశాల నుంచి 4400 మంది పారా అథ్లెట్లు పతకాల కోసం బరిలోకి దిగబోతున్నారు. రాత్రి 11.30కు మొదలయ్యే పారాలింపిక్స్ ఆరంభోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. గతానికి భిన్నంగా నగరం మధ్యలో ఓపెన్ ఎయిర్‌లో చారిత్రాత్మక డి ల కాంకార్డ్, చాంప్స్-ఎలీసలో బుధవారం రాత్రి ఆరంభ వేడుకలను నిర్వహించనున్నారు. మార్చ్‌పాస్ట్‌లో పాల్గొనే 100 మంది సభ్యుల భారత బృందానికి జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్, షాట్‌పుటర్ భాగ్యశ్రీ పతాకధారులుగా ముందుండి నడిపించనున్నారు. సుమారు 65 వేల మంది ఈ కార్యక్రమ వీక్షణకు హాజరవుతారని అంచనా. పోటీలు గురువారం మొదలవుతాయి.

విధి వంచించినా.. తలవంచని ధైర్యం.. వైకల్యం సవాళ్లు విసిరినా.. అచంచల ఆత్మవిశ్వాసంతో వాటిని అధిగమిస్తూ.. వినువీధిలో గెలుపు గీతం వినిపిస్తూ.. అణువణువునా స్ఫూర్తిని నింపే విశ్వక్రీడా సంరంభం.. పారాలింపిక్స్‌కు నేడు తెరలేవనుంది. తమ మనోబలం ఎంత గొప్పదో చాటి చెప్పేందుకు పారా ఒలింపియన్లు ఈ క్రీడలను వేదికగా చేసుకోబోతున్నారు. వారి దేశాలకు గర్వకారణంగా నిలవాలన్న లక్ష్యంతో ఆకాశమే హద్దుగా చెలరేగేందుకు సిద్ధమైన ఈ క్రీడాకారులకు ఎవరైనా సలాం కొట్టాల్సిందే.

**జంబో బృందంతో..**

పారిస్ ఒలింపిక్స్‌లో భారత అథ్లెట్లు ఆరు మెడల్స్‌కే పరిమితమయ్యారు. కానీ ఆ లోటును భర్తీ చేసేందుకు దేశ పారా అథ్లెట్లు సిద్ధమవుతున్నారు. ఎందుకంటే రియో పారా గేమ్స్‌లో నాలుగు పతకాలే సాధించిన భారత్.. తమ పారాలింపిక్స్ చరిత్రలోనే తొలిసారిగా టోక్యోలో 19 మెడల్స్‌తో మెరిసింది. ఐదు స్వర్ణాలు, 8 రజతాలు, ఆరు కాంస్యాలతో పట్టికలో 24వ స్థానంతో ఆకట్టుకుంది. అందుకే రెట్టించిన ఉత్సాహంతో ఈసారి 84 మంది బృందం..12 క్రీడాంశాల్లో అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. అదే టోక్యో క్రీడలకు 54 మందే వెళ్లడం గమనార్హం. మరోవైపు ఈసారి పారాగేమ్స్‌లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురు అథ్లెట్లు కూడా ప్రాతినిధ్యం వహించబోతున్నారు.

**టార్గెట్ 25**

ఇటీవలి అంతర్జాతీయ పోటీల్లో భారత అథ్లెట్లు రాణిస్తున్న తీరుతో సర్వత్రా పారా గేమ్స్ పతకాలపై అంచనాలు పెరిగాయి. కనీసం 25 నుంచి 30 మెడల్స్ లక్ష్యంగా బరిలోకి దిగబోతున్నారు. ముఖ్యంగా ఆర్చరీ, అథ్లెటిక్స్, షూటింగ్‌లో ఎక్కువగా ఆశిస్తున్నారు. స్టార్ హైజంపర్ మరియప్పన్ తంగవేలు, టోక్యోలో రెండు పతకాలు సాధించి చరిత్ర సృష్టించిన మహిళా షూటర్ అవని లేఖారాతో పాటు మరో షూటర్ నర్వాల్, షట్లర్ కృష్ణ నాగర్, మనోజ్ సర్కార్, సుహాస్, జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్ మరోసారి పోడియం ఎక్కాలని భావిస్తున్నారు. అయితే వరల్డ్ చాంపియన్ షట్లర్ ప్రమోద్ భగత్ స్వర్ణ ఆశలు గల్లంతయ్యాయి. డోపింగ్ నిబంధనలు పాటించకపోవడంతో అతడిపై వేటు పడింది.

# జొకో, గాఫ్ సులువుగా..



## యూఎస్ ఓపెన్

న్యూయార్క్: నొవాక్ జొకోవిక్ యూఎస్ ఓపెన్ తొలి రౌండ్‌లో సునాయాసంగా గెలుపొందాడు. మంగళవారం జరిగిన మొదటి రౌండ్‌లో..రెండో సీడ్ జొకోవిచ్ 6-2, 6-2, 6-4తో అల్బాట్ (మాల్దోవా)ను చిత్తు చేశాడు. ఫ్లషింగ్ మెడోస్‌లో జొకోకిది 89వ విజయం. తద్వారా ఈ టోర్నీలో ఫెడరర్ అత్యధిక విజయాల రికార్డును నొవాక్ సమం చేశాడు. మహిళల మొదటి రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కొకొ గాఫ్ (అమెరికా) 6-2, 6-0తో గ్రచేవాను, టాప్ సీడ్ స్వియటెక్ 6-4, 7-6 (6)తో రఖిమోవాను, రెండో సీడ్ సబలెంకా 6-3, 6-3తో హాన్‌ను, 8వ సీడ్ క్రెజికోవా 7-6 (3), 6-3ను ఓడించారు.

**నగాల్ తొలి రౌండ్‌తోనే..:**

భారత స్టార్ సుమిత్ నగాల్ మొదటి రౌండ్‌తోనే తిరుగుముఖం పట్టాడు. హాలెండ్‌కు చెందిన టల్లోన్ గ్రీక్స్‌పూర్‌తో జరిగిన మ్యాచ్‌లో 1-6, 3-6, 6-7 (8)తో సుమిత్ వరుస సెట్లలో ఓటమిపాలయ్యాడు. ఇక నిషియోకా (జపాన్)తో కలిసి నగాల్ డబుల్స్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు.

# ఐసీసీకి జైషా

**చైర్మన్‌గా ఏకగ్రీవ ఎన్నిక**

**డిసెంబరు ఒకటిన**

**బాధ్యతల స్వీకరణ**



న్యూఢిల్లీ: బీసీసీఐ కార్యదర్శి జై షా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ప్రస్తుత చీఫ్ గ్రెగ్ బార్క్‌లే (న్యూజిలాండ్) మూడోసారి పోటీపడకూడదని నిర్ణయించుకున్న నేపథ్యంలో..జై షా ఒక్కడే పోటీలో మిగలడంతో అతడి ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. దాంతో జై షా (35) ఐసీసీకి చిన్న వయస్సులో చైర్మన్‌గా ఎన్నికైన వ్యక్తిగా రికార్డు సృష్టించాడు. వచ్చే డిసెంబరు ఒకటిన బార్క్‌లే నుంచి అతడు బాధ్యతలు చేపట్టనున్నాడు. 2019 అక్టోబరు నుంచి బీసీసీఐ కార్యదర్శిగా కొనసాగుతున్న షా..జనవరి 2021 నుంచి ఆసియా క్రికెట్ కౌన్సిల్ చైర్మన్‌గానూ వ్యవహరిస్తున్నాడు. జగ్‌మోహన్ దాల్మియా, శరద్ పవార్, ఎన్.శ్రీనివాసన్, శశాంక్ మనోహర్ తర్వాత ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న ఐదో భారతీయుడు జై షా.

**క్రికెట్‌ను విశ్వవ్యాప్తం చేస్తాం..:**

క్రికెట్‌ను ప్రపంచం నలుమూలలకు విస్తరింపజేసి ఆటకు మరింత ప్రాచుర్యం కల్పిస్తామని కొత్త చైర్మన్ జైషా చెప్పాడు. 2028 లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను ప్రవేశపెట్టడం ఆ దిశగా కీలక ముందడుగుగా అతడు పేర్కొన్నాడు.

**ఎన్నిక ఇలా..**

చైర్మన్ పదవికి నామినేషన్ల దాఖలుకు మంగళవారం చివరిరోజు. ప్రపంచ క్రికెట్‌లో బలమైన సభ్య దేశాలు ' సెనా' (సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా)లలో ఒక బోర్డు జై షా నామినేషన్‌ను ప్రతిపాదిస్తే..మరో క్రికెట్ బోర్డు సమర్థించినట్టు తెలిసింది. మరెవరూ నామినేషన్ వేయకపోవడంతో జై షా ఎన్నిక ఏకగ్రీవమైంది. టెస్టులు ఆడే దేశాలు 12, చైర్మన్, డిప్యూటీ చైర్మన్, అసోసియేట్ సభ్య దేశాలు నామినేట్ చేసే ఇద్దరు, ఒక స్వతంత్ర మహిళా డైరెక్టర్ కలిపి..ఐసీసీలో మొత్తం 17 ఓట్లున్నాయి.




## బాలీవుడ్ నుంచి శోభితకు ప్రత్యేక సాంగ్ ఆఫర్

మరో కొద్ది రోజుల్లో బాలీవుడ్ బ్యూటీ, తెలుగు సోయగం శోభిత దూళిపాళ్ల అక్కినేని వారి ఇంట అడుగుపెట్టబోతున్నది.ఇప్పటికే ఎంగేజ్‌మెంట్ పూర్తి చేసుకున్న నాగ చైతన్య, శోభిత జంట మరో రెండు మూడు నెలల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌తో పెళ్లి పీటలు ఎక్కనున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం తమ సినిమా షూటింగ్‌లను కానిచ్చేస్తున్నారు. నాగ చైతన్య తండేల్ సినిమా షూటింగ్ బిజీలో ఉండగా శోభిత సితార అనే ఓ హిందీ చిత్రంలో నటిస్తోంది. అయితే తాజాగా శోభితకు బాలీవుడ్ ప్రొడక్షన్ హౌజ్ నుంచి ఓ బంఫరాఫర్ వచ్చినట్లు తెలుస్తోంది. షారుఖ్‌ఖాన్, రణ్ వీర్ సింగ్ వంటి అగ్ర హీరోలు నటిస్తున్న డాన్3 సినిమాలో ఓ ప్రత్యేక పాట కోసం మూవీ మేకర్స్ శోభితను సంప్రదించినట్లు బాలీవుడ్ కోడై కూస్తోంది ఈ విషయమై ఇప్పటికే ఆమెతో చర్చలు కూడా ముగిసినట్లు తెలుస్తోంది. అయితే శోభిత ఇప్పటి వరకు తన సినీ కెరీర్‌లో ఒక్క ఐటెం సాంగ్ కూడా చేయలేదు. ఈమధ్యే నాగ చైతన్యతో పెళ్లికి సిద్ధమైన శోభిత మరి ఈ ఐటం సాంగ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా, ఇస్తుందా అనే విషయం తెలియాల్సి ఉంది. మరి కొద్ది రోజుల్లో అధికార ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఇదిలాఉండగా గతంలో నాగ చైతన్య, సమంత పెళ్లి తరువాత అక్కినేని ఫ్యామిలీ ఆమె కెరీర్ విషయంలో ఫుల్ ఫ్రీడమ్ ఇవ్వగా నాగ చైతన్య సమంతను బాగా ప్రోత్సహించాడు. ఆ క్రమంలో సమంత ఒకటి రెండు బోల్డ్ రోల్స్ చేసింది. దీంతో అవే వారి మధ్య విభేదాలకు కారణమనే ప్రచారం కూడా నడిచింది. ముఖ్యంగా ఫ్యామిలీ మ్యాన్ వెబ్ సిరీస్ వారి విడాకులకు ప్రధాన కారణమన్న వార్తలు కూడా అప్పట్లో బాగా హల్‌చల్ చేశాయి. అదే నిజమన్నట్లుగా చైతన్యతో కలిసి విడాకుల ప్రకటన జరిగిన నెలలోపే పుష్ప సినిమాలో సమంత గాటు ఐటెం సాంగ్ కూడా చేసింది.అదంతా ఇప్పుడు గతం అనుకుంటే కొద్దిరోజుల క్రితమే నాగచైతన్య ,శోభిత ల ఎంగేజ్మెంట్ జరగగా రాజస్థాన్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్ కు ప్లానింగ్ జరుగుతున్నట్లుగా సమాచారం. మరి ఈ పెళ్లయ్యాక అక్కినేని ఫ్యామిలీ సమంతకు ఇచ్చినట్టుగానే శోభిత సినిమాల్లో నటించడానికి ఒప్పుకుంటారా అనేది వంద డాలర్ల ప్రశ్నలా ఉంది. ఎదయితే సమంత చైతన్య విడాకుల విషయంలో ప్రముఖంగా వినిపించిన బోల్డ్ రోల్స్‌ను శోభితా తన కెరీర్ ముందు నుంచి పోషిస్తూ మంచి పేరు తెచ్చుకుంది. మరి ఇప్పుడు దర్శకుడు ఫరాన్ అక్తర్ డాన్ 3 సినిమాలో ఐటం సాంగ్ ఆఫర్ ఇచ్చారని తెలుస్తోంది. మరీ ఈ ఛాన్స్ ను శోభితా ఉపయోగించుకుంటుందా.. శోభితకు ఫ్యామిలీ నుంచి సపోర్ట్ లభిస్తుందా అనే ఆసక్తికరమైన చర్చ సోషల్ మీడియాలో తెగ నడుస్తోంది.

## అరియానా.. పర్ఫెక్ట్ నడుముతో స్టన్నింగ్ లుక్స్

తెలుగులో గ్లామరస్ యాంకర్ గా తనకంటూ ఒక ప్రత్యేకమైన క్రేజ్ అందుకున్న ముద్దుగుమ్మ అరియానా గ్లోరి. ఈ అమ్మడు యుట్యూబ్ ఛానల్స్ లో న్యూస్ యాంకర్ గా కెరియర్ స్టార్ట్ చేసి ఆ తరువాత సెలబ్రెటీలని ఇంటర్వ్యూలు చేసింది. అలా రామ్ గోపాల్ వర్మని ఇంటర్వ్యూ చేసి ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించింది. రామ్ గోపాల్ వర్మ అరియానా అందాన్ని ప్రశంసించడంతో లైమ్ లైట్ లోకి వచ్చింది. దాంతో తెలుగు బిగ్ బాస్ షోలో పార్టిసిపేట్ చేసే ఛాన్స్ ని అరియానా అందుకుంది.

రెండు సార్లు బిగ్ బాస్ షో లో పార్టిసిపేట్ చేయడమే కాకుండా దానికి రిలేటెడ్ గా ప్రసారం అయిన టాక్ షోకి అరియానా హోస్ట్ గా చేసింది. తద్వారా ఈ బ్యూటీకి తెలుగునాట విశేషమైన ఇమేజ్ వచ్చింది. బుల్లితెర రియాలిటీషోలలో కూడా అరియానా సందడి చేసింది. ఇలా ఈ అమ్మడు సెలబ్రెటీగా స్టార్ యాంకర్ గా మారిపోయింది. ప్రస్తుతం తెలుగులో ఉన్న హాట్ యాంకర్స్ లలో అరియానా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ ని సొంతం చేసుకొని దూసుకుపోతోంది. అడపాదడపా సినిమాలలో కూడా అరియానా నటిస్తోంది. ఈ ఏడాది అల్లరి నరేష్ హీరోగా వచ్చిన ఆ ఒక్కటి అడక్కు సినిమాలో హీరోయిన్ ఫ్రెండ్ క్యారెక్టర్ లో అరియానా నటించింది. హీరోయిన్ రేంజ్ క్యారెక్టర్ మాత్రం అరియానాకి లభించడం లేదు. కానీ అందంతో హీరోయిన్స్ కి ఈ అమ్మడు పోటీ ఇస్తోంది. ఇన్ స్టాగ్రామ్ లో యాక్టివ్ గా ఉండే ఈ ముద్దుగుమ్మ రెగ్యులర్ గా హాట్ ఫోటోషూట్ లతో సందడి చేస్తూ ఉంటుంది.





## నా జర్నీ ఇప్పుడే మొదలయ్యింది మిస్టర్ బచ్చన్ బ్యూటీ భాగ్యశ్రీ  భోర్సే

కొన్ని రోజులుగా నెట్టింట మార్మోగుతున్న పేరు భాగ్య శ్రీ బోర్సే .ఇటీవలే మాస్ రవితేజ-హరీష్ శంకర్‌కాంబినేషన్‌లో వచ్చిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది. సినిమా విడుదల కాకముందే ఏదో ఒక స్టిల్‌తో నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం ఊహించని డిజాస్టర్ టాక్ తెచ్చుకుంది. సినిమా హిట్టా.. ఫట్టా అనేది పక్కన పెడితే.. తెలుగులో ఇది మొదటి సినిమా కాబట్టి నటిగా తన ఫీలింగ్‌ను అందరితో షేర్ చేసింది. మీ అమ్మాయిపై మీరంతా చూపిస్తున్న ప్రేమ ఊహించలేనిది. నా ప్రయాణం కేవలం ఇప్పుడే మొదలైంది. నా నెక్ట్స్ చాప్టర్‌ను మీతో పంచుకునేందుకు వేచి ఉండలేకపోతున్నా.. అంటూ సోషల్ మీడియాలో రాసుకొచ్చింది భాగ్య శ్రీ బోర్సే. మొత్తానికి భాగ్య శ్రీ బోర్సే సక్సెస్‌ఫుల్‌గా జర్నీ సాగించాలంటే హిట్టు, ఫ్లాపులను ఒకేలా స్వీకరించాలంటూ చెప్పకనే చెబుతోంది. ఈ భామ ప్రస్తుతం విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేస్తున్న వీడీ 12 చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది.  దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న చిత్రంలో కూడా ఫీ మేల్ లీడ్ రోల్‌లో కనిపించబోతున్నట్టు వార్తలు వస్తుండగా.. వీటిపై క్లారిటీ రావాల్సి ఉంది.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986